# ప్రభాత సమాచారం

https: epaper.
prabhathasamacharam.com

ఆదిలాబాద్ Digital Edition

మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

■ గురువారం ।4 సెప్టెంబర్ 2025 । ■ 12 పేజీలు




8

## రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తుంది

■ వరద ప్రభావిత ప్రాంతాల్లో పంటలను పరిశీలించిన మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాల చారి


10



# దంచి కొట్టుడే


■ ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి

■ జిల్లాలో పొంగిపొర్లుతున్న వాగులు ■ నిండుకుండల్లా తలపిస్తున్న ప్రాజెక్టులు ■ ప్రాణహిత, పెన్‌గంగ ఉగ్రరూపం

■ వరదల్లో కొట్టుకుపోయిన ఆటో ■ సురక్షితంగా ప్రాణాలతో బయట పడ్డ ప్రయాణికులు ■ మరో 3 రోజులు వర్షాలు

■ బంగాళాఖాతంలో అల్పపీడనం ■ ఎల్లో అలర్ట్ జారీ ■ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి ■ వాతావరణ శాఖ హెచ్చరిక

జిల్లా వ్యాప్తంగా గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే వందల ఎకరాల్లో పంట నీటములుగా, కోత గురైన రోడ్లు, తెగిన బ్రిడ్జిలతో రాకపోకలు లేక అవస్థలు పడుతు న్నారు. తాజాగా బుధవారం జిల్లా కేంద్రం తో పాటు వివిధ మండలాల్లో ఎడ తెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు వాగు లు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. పలు లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లల్లోకి వరద నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అటు ప్రాజెక్టులకు భారీగా వరద నీరు వచ్చి చేరడంతో ప్రాజెక్టులన్ని నిండుకుండల్లా దర్శనమిస్తున్నాయి. సాత్నాల ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో పెరగడంతో అప్రమత్తమైన అధికారులు ఒక గేటును ఎత్తివేసి నీటిని దిగువకు వదిలారు.


12

### తారు రోడ్ల నిర్మాణానికి

## రూ.28 కోట్లు మంజూరు..!

■ 12 రోడ్ల నిర్మాణంతో 25 కిలోమీటర్ల రహదారి సౌకర్యం

■ ఫలించిన ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ కృషి

■ ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి

ఖానాపూర్ నియోజకర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ కృషి ఫలించించింది.ప్రభుత్వం 25.85 కిలోమీటర్ల తారు రోడ్లు నిర్మించేందుకు రూ.28కోట్ల 71లక్షలు కేటాయించింది. గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ విభాగం రోడ్ల నిర్మాణ పనులు చేపట్టనుంది. దీంతో మారుమూల గ్రామాలకు రహదారి సౌకర్యాలు మెరుగుపడనున్నాయి. ఇంద్రవెల్లి మండలంలోని ఘట్టెపల్లి నుంచి కొలాంగూడకు నాలుగున్నర కిలోమీటర్ల తారు రోడ్డు నిర్మాణానికి రూ.రూ.330.99 లక్షలు, సిరికొండ మండలంలో సిరికొండ ఆర్ అండ్ బి రోడ్ నుంచి దస్రు పటేల్ గూడ లకంపూర్ వరకు 2.70 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ.262.05 లక్షలను ప్రభుత్వం మంజూరు చేసింది.ఉట్నూర్ మండలంలో గొట్టి రోడ్డు నుంచి కోలాంగూడ వరకు కిలోమీటర్ తారు రోడ్డు నిర్మాణానికి రూ.103.58 లక్షలు, రాంగూడ రోడ్డుకు కు 1.80 కిలోమీటర్ల నిర్మాణానికి రూ.141.54 లక్షల నిధులు మంజూరయ్యాయి.


12

### పొద్దు పొడువగానే.. గడప గడపకు వెళ్లి..!

## జనం గుండె చప్పుడు విన్న ఎమ్మెల్యే

■ ప్రజలతో మమేకమై ఆప్యాయంగా పలకరిస్తూ వీదుల్లో మార్నింగ్ వాక్

■ సదర్మాట్‌ను సందర్శించి రైతుల సమస్యలు తెలుసుకొన్న ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ స్టైలే వేరు.. ఆయన ఎప్పుడు ప్రజల మధ్యనే గడిపి వారి సమస్యలు పరిష్కరించాలనే తత్వం.. సమస్యను స్వయంగా చూసి పరిష్కరించే అలవాటు.. అందుకే 'పొద్దు పొడుపు-బొజ్జన్న అడుగు' పేరుతో కార్యక్రమం నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో మార్నింగ్ వాక్ చేస్తు ప్రజలతో మమేకమై వారి గుండె చప్పుడు వింటున్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం రాత్రి బస చేసి తెల్లవారు జామున మార్నింగ్ వాక్ చేసారు.

### గని ప్రమాద ఘటనల్లో

7లో

## కారుణ్య వారసులకు గ్రేడ్-3 క్లర్క్ పోస్టులు

■ పట్టభద్రులైన అభ్యర్థులకు క్లరికల్ గ్రేడ్-3 పోస్టులకు సింగరేణి యాజమాన్యం అనుమతి

■ సింగరేణి సీఎండీ బలరామ్ నాయక్ వెల్లడి


2

### ఏసీబీకి పట్టుబడిన

## పంచాయతీ కార్యదర్శి

■ ఇందిరమ్మ ఇల్లు మొదటి దఫా బిల్లు కోసం 30వేలు డిమాండ్ చేసిన కార్యదర్శి వెంకటస్వామి

■ రూ.20వేలు లంచం తీసుకుంటుండగా పట్టివేత

■ మంచిర్యాల జిల్లాలో తీరు మారని అధికారులు

## తప్పిన ఘోర ప్రమాదం

■ వరదల్లో కొట్టుకోపోయిన ఆటో

■ సురక్షితంగా బయటపడ్డ 10 మంది ప్రయాణికులు

ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం సాత్వాజిగూడ వాగులో ఘోర ప్రమాదం తప్పింది. ప్రయాణికులతో వెళ్తున్న ఆటో వాగులో బోల్తా పడడంతో ప్రయాణికులు సురక్షితం బయటపడ్డారు. ఇంద్రవెల్లి మండల కేంద్రం నుంచి బుసపటం మధ్య ఉన్న సత్వాజిగూడ వద్ద వాగు పొంగి పొర్లుతుంది. బుధవారం మధ్యాహ్నం 10 మంది ప్రయాణికులతో వెలుతున్న ఆటో డ్రైవర్ నిర్లక్ష్యంతో వాగును దాటించే ప్రయత్నం చేస్తుండగా నీటి ప్రవాహానికి ఆటో వాగులో పడిపోయింది. గమనించిన స్థానికులు ప్రయాణికులను సురక్షితంగా బయటికి తీసుకువచ్చారు. దీంతో ప్రమాదం తప్పింది.

వివరాలు 8లో



# మెరుగైన వైద్య సేవలు అందించాలి

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల, సెప్టెంబర్ 3 (ప్రభాత సమాచారం)** ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని జైపూర్ మండలం గంగిపల్లి గ్రామంలోని పల్లె దవాఖాన, ఆసుపత్రికి వెళ్లే రోడ్డు ను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పల్లె దవాఖాన కు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. ఆసుపత్రిలో అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని, వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని తెలిపారు. ఆసుపత్రిలోని వార్డులు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పాటించవలసిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలని తెలిపారు. రహదారి నుండి ఆసుపత్రికి వచ్చే అటాచ్ రోడ్డు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మరమ్మత్తులు చేయాలని తెలిపారు. గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించి వేగవంతం చేసే విధంగా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని తెలిపారు. నిబంధనలకు లోబడి 600 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇంటిని నిర్మించుకునేలా లబ్ధిదారులకు వివరించాలని తెలిపారు. కుందారం గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రిజిస్టర్లు, మందుల నిల్వలు, వార్డులను పరిశీలించి వైద్యులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి తరగతి గదులు, వంటశాల, హాజరు పట్టిక, మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థినులకు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని, ఆహారం తయారీలో తాజా కూరగాయలు, నిత్యవసర సరుకులను వినియోగించాలని, విద్యార్థులకు శుద్ధమైన త్రాగునీటిని అందించడంతో పాటు వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం





విద్యార్థులతో మాట్లాడుతూ ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని సాధించే దిశగా పట్టుదలతో కృషి చేయాలని తెలిపారు. ప్రభుత్వం విద్యారంగ బలోపేతం దిశగా అనేక చర్యలు చేపడుతుందని, అన్ని ప్రభుత్వ విద్య సంస్థలను అభివృద్ధి చేస్తూ నాణ్యమైన విద్యను అందిస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. అదే విధంగా విద్యార్థులు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఎటువంటి ఆరోగ్యం సమస్యలు ఉన్న అధికారులకు తెలియజేయాలన్నారు. అధికారులు సైతం విద్యార్థుల పట్ల శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి సత్యనారాయణ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఏసీబీకి పట్టుబడిన పంచాయతీ కార్యదర్శి

**-ఇందిరమ్మ ఇల్లు బిల్లు కోసం రూ. 30వేలు డిమాండ్**
**-రూ.20వేలు లంచం తీసుకుంటుండగా పట్టివేత**

**మంచిర్యాల, సెప్టెంబర్ 3 (ప్రభాత సమాచారం)** ఇందిరమ్మ ఇంటి బిల్లు కోసం లంచం అడిగిన పంచాయతీ కార్యదర్శి ఏసీబీకి పట్టుబడిన ఘటన మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలంలోని కర్ణమామిడిలో చోటు చేసుకుంది. ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి ఏసీబీ డీఎస్పీ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణమామిడి పంచాయతీ కార్యదర్శి వెంకటస్వామి ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు మొదటి దఫా బిల్లు కోసం బేస్‌మెంట్ లేవల్ నిర్మాణం జరిగిన తరువాత ఫొటో కాప్చర్ తీసి ఉన్నతాధికారులకు పంపించాల్సిన అవసరం ఉంటుంది. అప్పుడే లబ్ధిదారులకు మొదటి దఫా బిల్లు మంజూరవుతుంది. పంచాయతీ కార్యదర్శి వెంకటస్వామి ఫొటో కాప్చర్ తీయడానికి గ్రామంలోని ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారైన డొల్క నాగమణికి 30వేల రూపాయలు డిమాండ్ చేశారు. బ్రతిమిలాడగా 20వేల రూపాయలకు ఒప్పుకున్నాడు. ఈ విషయమై లబ్ధిదారు ఏసీబీ



అధికారులను ఆశ్రయించింది. బుధవారం లబ్ధిదారు నివాసానికి వచ్చిన పంచాయతీ కార్యదర్శి 20వేల రూపాయలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. కేసు నమోదు చేసి కరీంనగర్ ఏసీబీ కోర్టుకు తరలించినట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి వెంకటస్వామి ఏసీబీ అధికారులకు పట్టుబడినట్టు గ్రామస్థులకు తెలియడంతో పంచాయతీ కార్యదర్శి ద్వారా ఇబ్బందులు పడిన 30 మంది బాధితులు డొల్క నాగమణి ఇంటికి చేరుకున్నారు. తాము కూడా లంచం ఇచ్చామంటూ న్యాయం చేయాలని నినాదాలు చేశారు.. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల బిల్లుల కోసం, ఇంటి నిర్మాణానికి ఎన్‌వోసీల కోసం, ఇతరత్ర అవసరాల కోసం రూ.లక్షల్లో వసూలు చేశాడని ఏసీబీ అధికారుల ముందు వాపోయారు. లంచం ఇచ్చినట్టు ఆధారాలు ఉంటే తమకు తెలియజేస్తే చర్యలు తీసుకుంటామని ఏసీబీ అధికారులు తెలిపారు. కాగా ఇన్ని రోజులుగా తమను ఇబ్బంది పెట్టిన పంచాయతీకార్యదర్శి ఏసీబీకి పట్టుబడడంతో గ్రామంలో సంబరాలు జరుపుకున్నారు.



## కలెక్టరేట్ ఎదుట విద్యార్థుల ధర్నా

**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 3 (ప్రభాత సమాచారం)** స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్ మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట విద్యార్థులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు మాట్లాడారు విద్యార్థుల స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయడంతో పాటు జిల్లాలో శిథిలావస్థలో ఉన్న విద్యా భవనాలను శాశ్వత భవనాలుగా నిర్మించాలని, గురుకుల ఆశ్రమ సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థుల మరణాలను అరికట్టాలన్నారు. అలాగే విద్యాశాఖ మంత్రిని నియమించి, విద్యారంగం సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## సోషల్ మీడియా కో ఆర్డినేటర్‌గా సతీష్

**చెన్నూర్, సెప్టెంబర్ 3 (ప్రభాత సమాచారం)** కోటపల్లి మండలం చెన్నూర్ నియోజకవర్గ అసెంబ్లీ యువజన కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా చేనేల్లి సతీష్ నియమితులు అయ్యారు. గత పది సంవత్సరాల నుండి చేసిన సేవలను గుర్తించి తనపై నమ్మకంతో పదవి ఇప్పించిన మంచిర్యాల డీసీసీ మెంబర్ సురేఖకు పీసీసీ సభ్యులు నూకల రమేష్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ బాధ్యతాయుతంగా పనిచేస్తానని సతీష్ అన్నారు.



## బీసీ రిజర్వేషన్ బిల్లులను ఆమోదించాలి

**జన్నారం, సెప్టెంబర్ 3 (ప్రభాత సమాచారం)** గవర్నర్ బీసీ రిజర్వేషన్ బిల్లును వెంటనే ఆమోదింపచేయాలని, బిసి కులాల ఉద్యమ పోరాట సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ కోడూరు చంద్రయ్య అన్నారు. బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణలోని గ్రామ పంచాయతీలు, మండల పరిషత్తులు, జిల్లా పరిషత్తులు, పురపాలికలు, నగరపాలక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లపై 50% పరిమితిని ఎత్తివేస్తూ బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచేందుకు ఉద్దేశించిన పంచాయతీరాజ్ పురపాలక చట్టాల సవరణ బిల్లులు రెండింటిని రాష్ట్ర ప్రభుత్వము మంగళవారం రాజభవన్‌కు పంపించింద న్నారు. ఆదివారం శాసనసభలో సోమవారం శాసనమండలిలో ఈ బిల్లులు ఆమోదం పొందాయన్నారు. వీటిని గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ఆమోదం కోసం మంగళవారం ఉదయం రాజ్ భవన్‌కు రాష్ట్ర ప్రభుత్వం పంపించిందన్నారు. సోమవారం ఉదయమే రాష్ట్ర మంత్రులు అఖిలపక్ష నేతల బృందం గవర్నర్ జిష్ణు దేవ్ వర్మని కలిసి బిల్లులను ఆమోదించాలని ప్రత్యక్షంగా కలిసి కోరడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కో కన్వీనర్ నర్సయ్య , భాస్కర్ గౌడ్ పాల్గొన్నారు.



## వరద ప్రవాహంతో రాకపోకలు నిలిపివేత

**సిర్పూర్ (టి), సెప్టెంబర్ 3 (ప్రభాత సమాచారం)** సిర్పూర్ టి మండలంలోని హుడికిలి వెంకట్రావుపేట వద్ద వరద నీటి ప్రవాహం తీవ్రంగా పెరగడంతో రాకపోకలను పోలీసులు పూర్తిగా నిలిపివేశారు. ప్రజల ప్రాణ భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సిర్పూర్ టీ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ ఎం. కమలాకర్ తెలిపారు. ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ వరద నీటిలో స్నానాలకు, చేపల వేటకు వెళ్ళకూడదని, అలాగే ప్రవాహాన్ని దాటే ప్రయత్నం చేయరాదని హెచ్చరించారు. ప్రజల సహకారమే ప్రమాదాలను నివారించగలదని, అందరూ అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.



# 8న ఐటీఐ కళాశాలలో అప్రెంటిషిప్ మేళా

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 3 (ప్రభాత సమాచారం)** పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈనెల 8న జాతీయ అప్రెంటిషిప్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పీ. శ్రీనివాస్ పేర్కొన్నారు. కావున ఐటీఐ ఉత్తీర్ణులైన విద్యార్థిని, విద్యార్థులు ఆన్ లైన్ https://www.apprenticeshipindia.gov.in/met Registrafico ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు మేళాకు వచ్చేటప్పుడు రిజిస్ట్రేషన్ చేసుకున్న కాపీ, ఆధార్ కార్డు, ఎస్ఎస్.సి మెమో, కులం, ఐటీఐ పాస్ సర్టిఫికేట్, రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు తీసుకురావాలని సూచించారు. అప్రెంటిషిప్ కల్పించడానికి డైనమిక్ టూర్స్ ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్, ఐటీసీ ఫుడ్ డివిజన్, హైదరాబాద్, రాణీ ఇంజిన్ వాల్స్ లిమిటెడ్, హైదరాబాద్, ఆర్టీసీ, ఎల్.జీ ఇతర కంపెనీలు పాల్గొంటున్నాయని పేర్కొన్నారు. సెలెక్ట్ అయిన అభ్యర్థులకు అప్రెంటిషిప్ షిప్ 1961,209 ప్రకరంగా స్టైఫండ్ ను శిక్షణ కాలంలో నేరుగా అభ్యర్థుల అకౌంట్ లో జమ చేయనున్నట్లు పేర్కొన్నారు. కావున జిల్లాలో ఉన్న ఐటీఐ ఉత్తీర్ణులైన అభ్యర్థులు మేళాలో పాల్గొనాలన్నారు.




## గ్రామ పాలనాధికారుల నియామక ప్రక్రియ
# సమర్థవంతంగా నిర్వహించాలి

### రాష్ట్ర ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ లోకేష్ కుమార్

**మంచిర్యాల, సెప్టెంబర్ 3 (ప్రభాత సమాచారం)**
గ్రామీణ స్థాయిలో పరిపాలన సులభతరం చేసే విధంగా ప్రభుత్వం చేపట్టిన గ్రామ పాలనాధికారులకు నియామక ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ లోకేష్ కుమార్ అన్నారు. బుధవారం హైదరాబాద్ నుండి ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, అధికారులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చీఫ్ కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన గ్రామ పాలన అధికారుల నియామకం సంబంధించి ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని, నియామక ఉత్తర్వుల పంపిణీ, మార్గదర్శకాలపై పలు సూచనలు చేశారు. ఈ నెల 5వ తేదీన హైదరాబాద్ లోని హైటెక్ సిటీలో జరగనున్న కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చేతులమీదుగా గ్రామ పాలనా అధికారులకు నియామక ఉత్తర్వులు పంపిణీ చేయడం జరుగుతుందని, ఈ నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని ముఖ్యమైనదిగా భావించి తగు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఇన్చార్జి మంత్రులు, స్థానిక మంత్రులు, శాసనమండలి సభ్యులు, శాసనసభ్యులు, ప్రజా ప్రతినిధులకు ఆహ్వానాలు పంపించాలని తెలిపారు. కార్యక్రమానికి హాజరయ్యే నియమించబడిన గ్రామ పాలన అధకారులను దృష్టిలో ఉంచుకొని ప్రతి జిల్లా నుండి హైదరాబాద్ లోని హైటెక్ సిటీ కు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని, సకాలంలో నియామక ఉత్తర్వుల పంపిణీ కార్యక్రమానికి హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామ పాలన అధికారులుగా నియమించబడే వారికి తమ స్వగ్రామం, మండలం, నియోజకవర్గంలో పోస్టింగ్ ఇవ్వకూడదని, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, దంపతులకు నిర్దిష్ట పరిస్థితులలో విశేష మినహాయింపులు ఇవ్వవచ్చని, సంబంధిత అంశాలను జిల్లా స్థాయిలో పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామ పాలనాధికారుల పోస్టింగ్ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, నిబంధనలకు లోబడి నిర్వహించాలని, ప్రతి క్లస్టర్ కు తగిన అభ్యర్థిని నియమించేందుకు జిల్లా కలెక్టర్ సమీక్షించాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం హైదరాబాద్ లో జరగనున్న నియామక ఉత్తర్వులు పంపిణీ కార్యక్రమానికి జిల్లాకు చెందిన గ్రామ పాలన అధికారులను సకాలంలో తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం నుండి 3 బస్సులను ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రతి బస్సులో ఒక



ఉపతహసిల్దార్, ఒక పోలీస్ కానిస్టేబుల్ ఉంటారని తెలిపారు. ఈనెల 5వ తేదీ ఉదయం 8.30 గంటలకు బస్సులు బయలుదేరుతాయని, గ్రామ పాలన అధికారులకు భోజన సౌకర్యం కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య, కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## అభివృద్ధి, సంక్షేమానికి
# పకడ్బందీ చర్యలు

**బెజ్జూర్, సెప్టెంబర్ 3 (ప్రభాత సమాచారం)**
అభివృద్ధి సంక్షేమంపై ప్రత్యేక తీసుకుంటున్నట్లు ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అభివృద్ధి అంశాలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల ప్రోగ్రెస్, ఉపాధి హామీ, సీసనల్ వ్యాధుల నివారణకు చర్యలు, బ్లీచింగ్, ఫాగింగ్, నీరు నిలువ ఉండకుండా చూడడం, నీరు ఉంటే దోమలు ఉండకుండా ఆయిల్ బాల్స్ వేయడం, మలేరియా, డెంగ్యూ మొదలగు వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు త్వరగా పూర్తి చేయుటకు ఏమైనా అవంతరాలు ఉంటే వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. గ్రూప్ మహిళా సభ్యులకు బ్యాంకు లింకేజి ద్వారా రూ50 వేల వరకు రుణాలు మంజూరు గురించి తెలిపారు.

## గిరిజన ప్రాంతాల్లో నెట్‌వర్క్
# సమస్యను పరిష్కరించండి

### బీఎస్ఎన్ఎల్ సీజీఎంకు ఎమ్మెల్యే అనిల్ వినతి

**బోథ్, సెప్టెంబర్ 3 (ప్రభాత సమాచారం)**
బోథ్ నియోజకవర్గంలోని పలు మారుమూల గిరిజన ప్రాంతాల్లో సెల్ నెట్‌వర్క్ సమస్యలపై బుధవారం హైదరాబాద్‌లోని బీఎస్ఎన్ఎల్ సీజీఎంను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కలిశారు. ఈ సందర్భంగా బోథ్ నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో గల మారుమూల గిరిజన ప్రాంతాల్లో నెట్‌వర్క్ లేక అవస్థలు పడుతున్నారని నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో నెట్వర్కులు లేని ప్రాంతాల్లో నూతన టవర్లు ఏర్పాటు చేయాలని కోరారు. నెట్‌వర్క్ ఉన్న గిరిజన ప్రాంతాల్లో టవర్లు సాంకేతిక లోపాల వల్ల సమస్యలు ఏర్పడుతున్నాయని అలాగే కొన్ని టవర్లకు విద్యుత్తు సౌకర్యం లేకపోవడంపై అవి పని చేయడం లేదని వాటిని పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. దీనికి



సీజీఎం సానుకూలంగా స్పందించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

# బాధితులకు నిత్యావసర సరుకుల అందజేత

**జన్నారం, సెప్టెంబర్ 3 (ప్రభాత సమాచారం)**
పొనకల్ గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సులువా పోశెట్టి కుటుంబానికి పీసీఆర్ పూర్ణచంద్రావు పౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం 50 కేజీల బియ్యన్ని ఫౌండేషన్ వ్యవస్థాపకులు ముదుగు ప్రవీణ్ కుమార్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు పొనకల్ మాజీ ఎంపిటిసి రాగుల శంకర్, చిట్యాల సత్యం, తదితరులు పాల్గొన్నారు.





## ఆదిలాబాద్‌లో పర్యటించిన
# అంబేడ్కర్ వర్సిటీ డైరెక్టర్

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 3 (ప్రభాత సమాచారం)**
డా.బీఆర్ అంబెడ్కర్ యూనివర్సిటీలో సమత సపోర్ట్ స్కీం కింద గిరిజనులకు, దివ్యాంగులకు, ట్రాన్స్ జెండర్లకు ఉచిత విద్యను అందించనున్నట్టు అంబేద్కర్ యూనివర్సిటీ స్టూడెంట్ సర్వీస్ డైరెక్టర్ వై.వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం ఆయన డిగ్రీ కళాశాలలోని అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీని సందర్శించారు. అడ్మిషన్ల పెంపుకు తీసుకోవాల్సిన చర్యల గురించి ఇక్కడి సిబ్బందికి సూచించారు. అనంతరం డిగ్రీ కళాశాల సైన్సెస్ ప్రిన్సిపల్ సంగీతతో కలిసి పలు విషయాలను చర్చించి నూతన కోర్సుల గురించి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ రాష్ట్ర స్టూడెంట్ సర్వీస్ డైరెక్టర్ వై.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ రెగ్యులర్‌గా చదవలేని విద్యార్థులకు విద్యను అందిస్తుందని అన్నారు. ఉచిత విద్య గోండ్, కోయ, చెంచు ఇతర గిరిజన వర్గాల విద్యార్థులకు వర్తిస్తుందని పేర్కొన్నారు. ఎడ్యూకేషన్ ఎట్ యువర్ డోర్ స్టెప్ ద్వారా నాణ్యమైన సేవలను అందించేల వసతుల కల్పనకు కృషి కోసం రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లో పర్యటిస్తున్నామని తెలిపారు. యూనివర్సిటీ ద్వారా అందించే పుస్తకాలు పోటీపరీక్షలకు సైతం సన్నద్ధమయ్యేలా ఉపయోగపడుతాయన్నారు. రెగ్యులర్ వారితో పోటీ పడేల అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ విద్యార్థులు రాణిస్తున్నారన్నారు. అడ్మిషన్లు పెంచేందుకు గాను రీజనల్ సెంటర్లను సందర్శించి ఇక్కడి వసతులు, ఇతర సౌకర్యాల గురించి తెలుసుకుంటున్నామన్నారు. అదే సందర్భంలో నూతన పథకాల గురించి కూడా విద్యార్థులకు తెలియజేయడం జరుగుతుందన్నారు. ఆదిలాబాద్ లో కొన్ని సమస్యలను గుర్తించడం జరిగిందని వాటిని కూడా అధిగమిస్తామని పేర్కొన్నారు. అలాగే విద్యార్థులు కొన్ని కోర్సులు ప్రవేశపెట్టాలని కోరగా ఆ దిశగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ సీఎస్.టీడీ వెంకటరమణ, ప్రొఫెసర్ రవీందర్, వర్సిటీ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ జగ్రామ్, వర్సిటీ సిబ్బంది అనిల్, హరిదాస్, సయ్యద్ శంషీర్ అలీ, తబ్రేజ్, రాంలకన్, అజీజా పాల్గొన్నారు.

# వర్షంలో 104 సిబ్బంది నిరసన

### పెండింగ్ వేతనాలు చెల్లించాలంటూ కలెక్టరేట్ ఎదుట రిలే దీక్షలు

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 3 (ప్రభాత సమాచారం)**
ఐదు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ 104 ఉద్యోగులు, సిబ్బంది నిరసన 2వ రోజు కొనసాగింది. జిల్లా కలెక్టరేట్ ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలో భాగంగా బుధవారం వర్షం ను సైతం లెక్క చేయకుండా సిబ్బంది తమ నిరసనను తెలియజేశారు. ఈ సందర్భంగా 104 ఉద్యోగుల సంఘము జిల్లా అధ్యక్షులు మామిడి వెంకన్న మాట్లాడుతూ... గత 17 సంవత్సరాలుగా ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న 104 ఉద్యోగులకు కనీస వేతనాలు లేకుండా విధులకు హాజరవుతున్న పరిస్థితి నెలకొందన్నారు. ప్రస్తుతం 104 ఉద్యోగులను వంటి విభాగాల్లో అడ్జెస్ట్మెంట్ చేసి విధుల్లో ఉంచారు. అయితే, 2025 ఏప్రిల్ నుండి ఆగస్టు వరకు 5 నెలల వేతనాలు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయలేదన్నారు. అలాగే ఉద్యోగాల కంటిన్యూషన్ పై స్పష్టత ఇవ్వకపోవడం వల్ల, ఉద్యోగులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. అనేక మార్లు ఉన్నత అధికారులను కలిసి విన్నవించినా సమస్య పరిష్కారం కాకపోవడంతో ధర్నా కార్యక్రమం చేపట్టామన్నారు. వర్షాకాలం, సీజనల్



వ్యాధుల నేపథ్యంలో 104 ఉద్యోగుల పని చేస్తున్న చోట వైద్య సేవలు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇది ప్రజారోగ్యానికి నష్టాన్ని కలిగించనుందని తెలిపారు. కనీసం వేతనాలు చెల్లించక, ఉద్యోగులను వెట్టి చాకిరీకి గురి చేస్తున్నారని వాపోయారు.



## గణేషుడికి తీరొక్క ప్రసాదాలు

**మంచిర్యాల, సెప్టెంబర్ 3 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల పట్టణంలోని రాంనగర్‌లో 'మన పార్వతీ పుత్ర గణేషుడి'కి భక్తులు తీరొక్క ప్రసాదాలు సమర్పించారు. గుండేటి అనసూర్య అనే భక్తురాలు ఒక్కరే ఏకంగా 55 రకాల ప్రసాదాలను సమర్పించి దేవుడి మీద తనకు ఉన్న భక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు, మహిళలతో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో భక్త మండలి అధ్యక్షుడు సిరిపురం గణపతి, కోశాధికారి నవీన్ కుమార్, ఉపాధ్యక్షుడు హరిప్రసాద్, ప్రధాన కార్యదర్శి హరి, గౌరవాధ్యక్షుడు చిటూరి పాపారావు, ప్రచార కార్యదర్శి మారం రఘు, సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.


## వర్షాలకు దెబ్బతిన్న పంటల పరిశీలన



**బెల్లంపల్లి, సెప్టెంబర్ 3 (ప్రభాత సమాచారం)**
బెల్లంపల్లి మండలంలో గత వారం రోజులుగా కురుస్తున్న అధిక వర్షాలకు దెబ్బతిన్న పత్తి, వరి పొలాలను బుధవారం అధికారులు పరిశీలించారు. దుగ్నేపల్లి, రంగపేట, పెర్కపెల్లి గ్రామాలలో ఏవో ప్రేమ్ కుమార్, ఏఈవో శ్రీను సర్వే చేశారు. బుధఖుర్ధ్, బుధకలన్, కన్నాల గ్రామాలలో ఏఈవో తిరుపతి సర్వే చేశారు. నష్టం శాతాన్ని అంచనా వేసి నష్టపోయిన నిజమైన రైతుల వివరాలను ప్రభుత్వానికి నివేదిస్తామని, ఇంకా ఎవరికైనా పంట నష్టం జరిగి సర్వే చేయించుకోనట్లయితే వెంటనే సంబంధిత ఏఈవోను గాని, తనను గాని ఫోన్‌లో సంప్రదించి వివరాలు తెలపాలని వ్యవసాయ అధికారి సుద్దాల ప్రేమ్ కుమార్ అన్నారు.

## కంటి వైద్య నిపుణుడికి సన్మానం

**బెల్లంపల్లి, సెప్టెంబర్ 3 (ప్రభాత సమాచారం)**
బెల్లంపల్లి పట్టణంలోని శాంభవి కంటి దవఖాన డాక్టర్ కొంకటి అంజయ్యను బుధవారం 28వ వార్డు మాజీ కౌన్సిలర్ డి.పూలమ్మ ఘనంగా సన్మానించారు. గత 12 సంవత్సరాలుగా బెల్లంపల్లి ప్రాంత ప్రజలకు ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహిస్తూ తక్కువ ఖర్చుతో కంటి అద్దాలను అందజేస్తున్నందుకుగాను కొంకటి అంజయ్య సన్మానించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్, వాసవి క్లబ్, తాజ్ బాబా సేవ సంస్థల ద్వారా పేదలకు కంటి పరీక్షలు చేస్తున్న అంజయ్యను సన్మానించడం సంతోషంగా ఉందని అన్నారు.



# మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

### కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 3 (ప్రభాత సమాచారం)**
మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా తోడ్పాటు అందించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయం ఆవరణలో ఇందిరా మహిళ శక్తి పథకం క్రింద ఆసిఫాబాద్ మండలం బూర్గుడ గ్రామానికి చెందిన స్వయం సహాయక సంఘం సభ్యురాలు కుందారపు రాణికి రూ.10 లక్షలతో మంజూరైన మొబైల్ చేపల విక్రయ వాహనం యూనిట్ ను జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి తో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రభుత్వం మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా అనేక వ్యాపారాలు చేసేందుకు ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. స్వయం సహాయక సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం అందిస్తున్న రుణ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. బూర్గుడ గ్రామానికి చెందిన స్వయం సహాయక సంఘం సభ్యురాలు 4 లక్షల రూపాయల సొంత నిధులు, 6 లక్షల రూపాయల ప్రభుత్వ రాయితీ నిధులతో సంచార చేపల విక్రయ వాహనం నిర్వహించేందుకు ముందుకు రావడం సంతోషంగా ఉందని, మహిళలు వ్యాపారాలు నిర్వహించి ఆర్థిక స్వావలంబన పొందడమే కాకుండా కుటుంబ అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు.

## ఉత్తర భారతీయుల కోసం మరో కొత్త అమృత్ భారత్ రైలు

**కాగజ్‌నగర్, సెప్టెంబర్ 3 (ప్రభాత సమాచారం)**
ఉత్తర భారతీయుల కోసం ప్రత్యేకించి ఛత్తీస్‌గఢ్ మరియు బీహార్ వాసుల కోసం కొత్త అమృత్ భారత్ రైలును దక్షిణ మధ్య రైల్వే మంజూరు చేసిందని ఎమ్మెల్యే హరీష్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అమృత్ భారత్ రైలు సికింద్రాబాద్ నుంచి మొదలై సిర్పూర్-కాగజ్ నగర్ స్టేషన్ మీదుగా బల్లార్షా, నాగపూర్, గోండియా నుంచి బిలాస్పూర్ మీదుగా గయా, పాట్నా, ముజఫర్ నగర్ వరకు ప్రయాణిస్తుందని తెలిపారు. ఈ రైలులో 11 సాధారణ బోగీలు, 8 స్లీపర్ బోగీలు మరియు పాంట్రీ కారు అందుబాటులో ఉండి పేద మధ్య తరగతి ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందని తెలిపారు. ఉత్తర తెలంగాణలో ప్రత్యేకించి హైదరాబాద్, మంచిర్యాల మరియు సిర్పూర్-కాగజ్ నగర్ తదితర ప్రాంతాల్లో చాలామంది ఛత్తీస్‌గఢ్, బీహార్ వాసులు నివాసం ఉంటున్నారని, వారికి ఈ సికింద్రాబాద్- ముజఫర్‌నగర్ అమృత్ భారత్ రైలు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. అలాగే ప్రసిద్ధి చెందిన గయా పట్టణం బౌద్ధులకు మరియు హిందువులకు ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతోందని, ఈ రైలు ద్వారా ప్రయాణికులు నేరుగా గయాకు చేరుకోవచ్చని తెలిపారు. వచ్చే నెల నుండి ప్రారంభమయ్యే ఈ అమృత్ భారత్ రైలును ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.



## స్తంభించిన ఉత్పత్తి.. ఆగిన బొగ్గు రవాణా



**బెల్లంపల్లి, సెప్టెంబర్ 3 (ప్రభాత సమాచారం)**
బెల్లంపల్లి ఏరియా సింగరేణి ప్రాంతంలో ఎడతెరపి లేకుండా కురిసిన వర్షం బొగ్గు ఉత్పత్తికి, మట్టి తొలగింపు(ఓవర్ బర్డెన్) పనులపై తీవ్ర ప్రభావం పడింది. గత నెల 27వ తేదీ నుంచి వరుసగా వర్షం పడటంతో.. ఖైరిగూర ఓసీపీలో పూర్తిగా బొగ్గు ఉత్పత్తి, రవాణా నిలిచిపోయింది. ఏరియాలో కేవలం ఒకే ఒక ఉపరితల గని ఉంది. ఖైరిగూర ఓపెన్కాస్టు ఒక రోజుకు మూడు షిఫ్టులలో 8 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాల్సి ఉంది. గత నెల 27 నుంచి మంగళవారం వరకు బొగ్గు పెళ్ల బయటకు రాకుండా వర్షం అడ్డుకుంది. వారం రోజుల కిందట గోలేటి నుంచి ఖైరిగూర ఓసీపీకి వెళ్లే మార్గ మధ్యలోని పావురాల గుట్ట వద్ద మట్టిరోడ్డు కొండల ఒత్తిడికి పగుళ్లు తేలి ఆరు అడుగుల మేర పైకి లేచింది. దీంతో రవాణా కుంటుపడింది. వర్షాలతో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడగా బొగ్గును రవాణా చేసే లారీలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. గత నెలలో బెల్లంపల్లి ఏరియా 2 లక్షల టన్నులకు 1.36 లక్షల టన్నులు సాధించింది. 20 రోజుల పాటు ఏకధాటిగా కురిసిన వర్షంతో 742 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. గత నెల 27న మొదటి షిఫ్టులో 1200 టన్నుల ఉత్పత్తి మాత్రమే సాధించింది. అదే రోజు మధ్యాహ్నం నుంచి సోమవారం వరకు 48,000 టన్నుల బొగ్గు సాధించాల్సి ఉండగా, ఏ ఒక్క రోజు ఉత్పత్తి జరగలేదని అధికారులు తెలిపారు. ఒక టన్ను బొగ్గుకు రూ.3,300 చొప్పున సుమారు రూ.16 కోట్ల వరకు నష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. క్వారీలోకి చేరుతున్న నీటిని ఎప్పటికప్పుడు ప్రత్యేక పంపుల ద్వారా బయటకు పంపిస్తున్నారు. డోజర్లు, డంపర్లతోపాటు ఇతర వాహనాలు నడిపించేందుకు రహదారులను గ్రేడర్ సహాయంతో చదును చేయిస్తున్నారు. పావురాల గుట్ట వద్ద రోడ్డు మరమ్మతులు తుది దశకు చేరుకున్నట్లు ఏరియా జీఎం ఎం. విజయభాస్కర్ రెడ్డి తెలిపారు. వారం రోజులుగా భారీగా కురుస్తున్న వర్షంతో బొగ్గు ఉత్పత్తి, రవాణా నిలిచిపోయినట్లు తెలిపారు.



## ఏరియా జీఎంగా బాధ్యతలు స్వీకరించిన రాధాకృష్ణ

**మందమర్రి, సెప్టెంబర్ 3 (ప్రభాత సమాచారం)**
సింగరేణి ఏరియా నూతన జనరల్ మేనేజర్‌గా రాధాకృష్ణ బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో నూతన జీఎంకు ఏరియా ఎస్ఓటు జీఎం విజయప్రసాద్, పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్, కేకే గ్రూప్ ఏజెంట్ రాంబాబు, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ భూ శంకరయ్య, ఐఈడి ఎస్ఈ కిరణ్ కుమార్, అన్ని డిపార్టుమెంట్ల హెచ్ఓడీలు పుష్పగుచ్చం అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏరియా స్థితి గతులను అన్ని డిపార్ట్మెంట్ల హెచ్ఓడీలు నూతన జీఎంకు వివరించారు. ఈ కార్యక్రమంలో జీఎం కార్యాలయం అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## ఉత్తమ ఫలితాలను సాధించాలి

**నిర్మల్, సెప్టెంబర్ 3 (ప్రభాత సమాచారం)**
ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు అన్ని సదుపాయాలు కల్పిస్తున్నామని విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులు తెచ్చుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న అన్నారు. నిర్మల్ పట్టణంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేసి తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులు చదువుకుంటున్న అంశాలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. తాను ఈ ప్రాంతం చెందిన వ్యక్తిని కష్టపడి చదవడం వల్లనే ఈ స్థాయికి ఎదిగినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.





# జిల్లాలో యూరియా పక్కదారి పట్టకుండా చూడాలి

### యూరియా, ఎరువులు పంట సాగుకు అనుగుణంగా పంపిణీ చేయాలి
### మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, సెప్టెంబర్ 3 (ప్రభాత సమాచారం)** జిల్లాలో కొనసాగుతున్న వ్యవసాయ సాగుకు అనుగుణంగా సకాలంలో యూరియా, ఎరువులు కార్యచరణ ప్రకారం పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి భుక్యా ఛాత్రు తో కలిసి మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులతో యూరియా, ఎరువుల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో యూరియా, ఎరువుల నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, వ్యవసాయ సాగుకు అనుగుణంగా సకాలంలో కార్యచరణ ప్రకారం రైతులకు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని, ఫర్టిలైజర్ దుకాణాలలో యూరియా, ఎరువుల నిల్వలు పరిశీలించి దుకాణ యజమానులు నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ – పాస్ మిషన్లలో నమోదు చేయబడిన వివరాలు, సంబంధిత ఫర్టిలైజర్ దుకాణాలలో నిల్వ ఉన్న ఎరువుల వివరాలలో ఎలాంటి విభేదాలు ఉండకూడదని తెలిపారు. యూరియా పక్కదారి పట్టకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, ఫర్టిలైజర్ దుకాణాల నుండి అధిక మొత్తంలో కొనుగోలు చేసే వారి వివరాలు పరిశీలించాలని, కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా రసీదు జారీ చేసి వివరాలు రిజిస్టర్ లో నమోదు చేయాలని, ఫర్టిలైజర్ దుకాణంలో ధరల వివరాలు, నిల్వ ఉన్న ఎరువుల వివరాలు ప్రదర్శించాలని తెలిపారు. పంట సాగు చేస్తున్న రైతులు, సాగు చేయని రైతుల వివరాలు సేకరించి నివేదిక అందించాలని తెలిపారు. కాలానికి అనుగుణంగా సాగు చేయవలసిన పంటల వివరాలు, సాగు మెలకువలను రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. పంట సాగు విస్తీర్ణం, యూరియా, ఎరువుల పంపిణీ, పంట సాగు చేసే రైతుల వివరాలు తదితర అన్ని అంశాలు



అనుసంధానమై ఉంటాయని, నివేదిక స్పష్టంగా ఉన్నట్లయితే వరి ధాన్యం, పత్తి, ఇతర పంటల దిగుబడి, కొనుగోలు ప్రక్రియ సమర్థవంతంగా చేసేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



### ఎడతెరిపి లేకుండా వర్షంతో
## సంతలో ఇబ్బందులు

**నార్నూర్, సెప్టెంబర్ 3 (ప్రభాత సమాచారం)** ఆదిలాబాద్ జిల్లా నార్నూర్, గాదిగూడ మండలాలలో బుధవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. నార్నూర్ మండల కేంద్రంలో వారసంత కావడంతో వారం రోజులకు సరిపడా సరుకులు, కూరగాయలు కొనుగోలుకు వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సంతలో కనీస సౌకర్యాలు లేకచిరు వ్యాపారస్తులు అవస్థలు పడ్డారు. ప్రతి ఏడాది లక్షల రూపాయలతో వేలంపాట అధికారులు నిర్వహిస్తున్నప్పటికీ కనీస సౌకర్యాలు కల్పించకపోవడం శోచనీయం. వర్షాకాలంలో తడుస్తూ వ్యాపారం చేయవలసిన దుస్థితి నెలకొందని చిరు వ్యాపారులు వాపోయారు. కనీసం కాల కృత్యాలకు నిమిత్తం మరుగుదొడ్డి కూడా నిర్మించలేని దుస్థితి ఉందని మండిపడ్డారు. ఇప్పటికైనా పంచాయతీ శాఖ అధికారులు స్పందించి వారసంతలో కనీస వసతులు కల్పించాలని కోరారు.

## చెన్నూరులో యూరియా కోసం రైతుల ధర్నా

### మద్దతు తెలిపిన మాజీ కౌన్సిలర్‌పై సీఐ దాడి

**చెన్నూర్, సెప్టెంబర్ 3 (ప్రభాత సమాచారం)** చెన్నూరు నియోజకవర్గంలో కేంద్రంలో బుధవారం రైతులు యూరియా కోసం ధర్నా నిర్వహించారు. ధర్నా చేస్తుంటే బీఆర్ఎస్ నాయకులు, మాజీ కౌన్సిలర్ అనిల్ వారికి మద్దతు తెలిపారు. ఎరువులను సకాలంలో రైతులకు అందజేయాలని రైతులతో కలిసి నినదించారు. ఈ క్రమంలో అక్కడికి చేరుకున్న చెన్నూరు సీఐ దేవేందర్ రావు ఆందోళనకారులను చెదరగొట్టే క్రమంలో మాజీ కౌన్సిలర్ అనిల్‌ను నెట్టివేశారు. ఈ చర్యను బీఆర్ఎస్ నాయకులతో పాటు రైతులు సైతం వ్యతిరేకించారు. సీఐ దేవేందర్ రావు తీరును విమర్శించారు. మాజీ కౌన్సిలర్ అనిల్ పట్ల సీఐ ప్రవర్తించిన తీరును నిరసిస్తూ బీఆర్ఎస్ నియోజక వర్గ ఇంఛార్జీ డాక్టర్ రాజా రమేష్ ఆధ్వర్యంలో బుధవారం పోలీస్ స్టేషన్ నుంచి ధర్నా నిర్వహించారు. రైతులకు అవసరమైన యూరియా తెప్పించకుండా



ఇబ్బందులు పెడుతుంటే ధర్నా చేస్తున్న వారిపై విరుచుకుపడి మంత్రి మెప్పుకోసం చూస్తే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. చెన్నూర్ రూరల్ సీఐ బన్సీలాల్ సంఘటన స్థలానికి చేరుకొని బీఆర్ఎస్ నాయకులతో మాట్లాడి ఆందోళనను విరమింపజేశారు. ఈ ధర్నాలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## ట్రాక్టర్ సాయంతో గర్భిణీల తరలింపు

**సిర్పూర్ (టీ), సెప్టెంబర్ 3 (ప్రభాత సమాచారం)** సిర్పూర్ (టీ) మండలం హుడికిలి గ్రామంలో బుధవారం వరద నీరు చేరడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో, అధికారులు గ్రామంలో ఉన్న ముగ్గురు గర్భిణీలను ముందుజాగ్రత్తగా ట్రాక్టర్ సహాయంతో సురక్షిత ప్రాంతానికి తరలించారు. సిర్పూర్ (టీ) తహసీల్దార్ రహీముద్దీన్ స్వయంగా ఈ సహాయక చర్యలను పర్యవేక్షించారు. సున్నిత వర్గాల ప్రజల రక్షణ కోసం ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ తెలిపారు.





### ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని
## ఆవిష్కరించిన ఎమ్మెల్యే ఏలేటి

**సారంగాపూర్, సెప్టెంబర్ 3 (ప్రభాత సమాచారం)** సారంగాపూర్ మండలం వైకుంఠపూర్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆవిష్కరించారు. గ్రామ యువకులు ర్యాలీతో ఎమ్మెల్యేకి ఘన స్వాగతం పలికారు. అనంతరం శివాజీ మహారాజ్ విగ్రహ ఆవిష్కరణ చేసి, పూలమాల వేసి నివాళులర్పించారు. నేటి యువత హిందూ హృదయ్ సామ్రాట్ శ్రీ ఛత్రపతి శివాజీ మహారాజ్ ను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మండల బీజేపీ నాయకులు, గ్రామ యువకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

### పంట నష్టపోయిన
## రైతులకు సాయం చేస్తాం
### ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి

**నిర్మల్, సెప్టెంబర్ 3 (ప్రభాత సమాచారం)** నిర్మల్ నియోజకవర్గంలో ఇటీవల కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో వరదల వల్ల పంట దెబ్బతిన్న రైతులను తప్పకుండా ఆదుకుంటామని ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి అన్నారు. బుధవారం దిలావర్పూర్ నర్సాపూర్ మండలాల్లో పర్యటించి గండిపడ్డ దేవుడు చెరువు వరదల వల్ల దెబ్బతిన్న పంటలను పరిశీలించి రైతులను నష్టం అడిగి తెలుసుకున్నారు. గండి పూడ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఓ పక్క జోరువాన కురుస్తున్న తడుసుకుంటు ఎమ్మెల్యే ఓపికగా రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నరేందర్ రెడ్డి, రమణారెడ్డి, ముత్యంరెడ్డి పాల్గొన్నారు.



## యూరియా కష్టాలు తీరేదెప్పుడో?

### ఆందోళన బాట పట్టిన రైతులు

**తాండూర్, సెప్టెంబర్ 3 (ప్రభాత సమాచారం)** ప్రభుత్వం తగినంత యూరియాను సరఫరా చేయడంలో విఫలం కావడంతో తాండూరు మండలం రేచిని గ్రామంలో రైతులు ఇక్కట్లకు గురవుతున్నారు. పీఏసీఎస్ గోదాంకు బుధవారం 12 టన్నుల యూరియా రావడంతో రైతులు ఎగబడ్డారు. ఉదయం నుంచే ఎరువుల విక్రయ కేంద్రం వద్ద క్యూ లైన్లు కట్టారు. వంతుల కోసం కేంద్రం ఎదుట చెప్పులను నిలిపి ఇతర పనులు చూసుకునేందుకు వెళ్లారు. కేంద్రానికి వచ్చిన రైతులకు తగినంత యూరియా లేకపోవడంతో ఆందోళనకు దిగారు. దీంతో పీఏసీఎస్ సిబ్బంది పోలీసులకు సమాచారం ఇవ్వగా అక్కడికి చేరుకున్న పోలీసులు గొడవను సద్దుమణిగించారు. వరుసలో ఉన్న రైతులకు ఒక్కొక్క యూరియా బస్తా చొప్పున అందించారు. బస్తాలు అందని వారు నిరాశగా వెనుదిరిగారు. వారం రోజులుగా ఉదయం నుంచి యూరియా కోసం పడిగాపులు కాస్తున్న అధికారులు, ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, కాంగ్రెస్ సర్కార్ చేతకానితనం వల్లనే యూరియా తిప్పలు ఏర్పడుతున్నాయని క్యూలో నిల్చొని యూరియా అందని రైతులు, మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు సరిపడా యూరియా అందించాలని డిమాండ్ చేశారు.



## డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అడ్మిషన్లు పోస్టర్‌లను

# విడుదల చేసిన ఉట్నూర్ ఐటిడిఏ పిఓ కుష్బూ గుప్తా

**ఉట్నూర్, సెప్టెంబర్ 3 (ప్రభాత సమాచారం)**
డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఆదివాసి గిరిజన విద్యార్థులకు పివిటిజి ఉచిత విద్య అందిస్తుందని డిబిఏఓ విద్యార్థి సేవా విభాగం డైరెక్టర్ డాక్టర్ వై వెంకటేశ్వర్లు తెలిపారు మారుమూల అటవీ ప్రాంతంలో నివసిస్తున్న గిరిజనులకు అనేక ఆర్థిక సామాజిక కారణాల విద్యను అందించాయి ఓపెన్ వర్సిటీ 500 రూపాయలు మాత్రమే ఫీజుతో డిగ్రీ విద్యార్థులకు అడ్మిషన్లు ఇస్తామన్నారు, ఈ సందర్భంగా ఉట్నూర్ ఐటిడిఏ పిఓ కుష్బూ అడ్మిషన్లు పోస్టర్ని విడుదల చేశారు, అడ్మిషన్ల చివరి తేదీ సెప్టెంబర్ 12 అని తెలిపారు. ఓపెన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ వెంకటరమణ ఓపెన్ యూనివర్సిటీ గత 43 సంవత్సరాల నుంచి నాణ్యమైన విద్యనందిస్తుందన్నారు ప్రొఫెసర్ గంటి రవీందర్ ఆదివాసులకు విద్యతో ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏవో దామోదర స్వామి, ఉట్నూరు డిగ్రీ కాలేజ్ సిబ్బంది ప్రిన్సిపాల్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.





## దొమ్మరి వాగుపై

# వంతెన నిర్మించండి

**మందమర్రి, సెప్టెంబర్ 3 (ప్రభాత సమాచారం)**
మండలంలోని లేమూర్ శివార్‌లోని దొమ్మరి వాగుపై గల తాత్కాలిక వంతెన ఇటీవుల కురిసిన వర్షాలతో తెగిపోవడంతో వెంకటాపుర్ గ్రామం నుండి లేమూర్ పంట పొలాలకు వెళ్లే రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ధర్మసమాజ్ పార్టీ యువ నాయకుడు రామగిరి మహేందర్ తెలిపారు. బుధవారం ఆయన గ్రామ రైతులతో కలిసి వాగును పరిశీలించి మాట్లాడారు. అధిక వర్షాలతో గత 15 రోజుల క్రితం వాగు తాత్కాలిక వంతెన కొట్టుకుపోవడంతో రైతులు వాగు దాటాలంటే ఇబ్బంది కరంగా మారిందన్నారు. ప్రతి సంవత్సరం వర్షాకాలం ఇదే సమస్యను రైతులు ఎదుర్కొంటున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపించారు. లేమూరు శివారులో సుమారు 12 వందల ఎకరాలను రైతులు సాగు చేస్తున్నారని, వెంకటాపుర్‌తో పాటు పొన్నారం,ఆదిల్ పేట్, చిర్రకుంట తదిత గ్రామాలకు చెందిన రైతులకు లేమురు శివారులో భూములు న్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి, ప్రస్తుత తాత్కాలిక వంతెన నిర్మించి, అనంతరం సమస్య పరిష్కారానికి శాశ్వత వంతెనను వెంటనే నిర్మించాలని కోరారు.

## సామూహిక వివాహా మహోత్సవ పోస్టర్ విడుదల



**బెల్లంపల్లి, సెప్టెంబర్ 3 (ప్రభాత సమాచారం)**
తిలక్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత సామూహిక వివాహ మహోత్సవ పోస్టర్‌ను సభ్యులు విడుదల చేశారు. అక్టోబర్ 26న జరుపనున్న సామూహిక వివాహ మహోత్సవంలో ఆసక్తి కలిగిన జంటలు పాల్గొనాలని కోరారు. సామూహిక వివాహాలలో పాల్గొనేవారు అక్టోబర్ 1న రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. వివరాలకు బెల్లంపల్లి తిలక్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులను సంప్రదించాలన్నారు.

## గణపతి మండపాల వద్ద

# జూదం ఆడితే కేసులు

### ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్ రెడ్డి

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 3 (ప్రభాత సమాచారం)**
గణేశ్ మండపాల వద్ద జూదం ఆడితే కేసులు నమోదు చేస్తామని ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్ రెడ్డి హెచ్చరించారు. ఆదిలాబాద్ పట్టణంలోని మూడు గణేశ్ మండపాల వద్ద జూదం ఆడుతున్న 20 మందిని అరెస్టు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. వారి వద్ద నుంచి 13 మొబైల్ ఫోన్లు, ఒక కారు, ఐదు ద్విచక్ర వాహనాలు, రూ.82,120 నగదు స్వాధీనం చేసుకున్నారు. గణేశ్ మండపాల వద్ద ఎవరైనా జూదం ఆడితే నిర్వాహకుల పైన సైతం కేసులు నమోదు చేస్తామన్నారు. గణపతి మండపాల వద్ద అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సమాచారం అందించాలని కోరారు.

## వినాయక మండపాల వద్ద

# అన్నదానాలు..ప్రత్యేక పూజలు



**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 3 (ప్రభాత సమాచారం)**
జిల్లా కేంద్రంలోని అయా గణేష్ మండలీల వద్ద అన్నదానాలు, ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి. సాయినగర్‌లోని ఓంసాయి గణేష్ మండలి, బజారువాడి సమర్థసాయి గణేష్ మండలి వద్ద మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. వేద పండితులు నిమ్మకంటి సంతోష్‌శర్మ, సాయిల ఆధ్వర్యంలో గణపతి పూజ అనంతరం కుంకుమపూజ నిర్వహించారు. మహిళలు ఏకరూప దుస్తులతో అధిక సంఖ్యలో పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్‌రావు, వన్ నేషన్ వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్ అరిగెల నాగేశ్వర్‌రావు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అరిగెల మల్లిఖార్జున్, సీఐ బాలాజీ వరప్రసాద్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు ఖాండ్రే విశాల్‌లు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వ్యాపారస్తులు రఫీక్ జివానీ, తాటిపెల్లి అశోక్, కమిటీ సభ్యులు శంకర్, కిషన్‌గౌడ్, గిరిగౌడ్, ప్రదీప్ పాల్గొన్నారు.


# గణేష్ దీక్ష చేపట్టడం ఆదర్శం

### మాజీ మంత్రి జోగు రామన్న

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 3 (ప్రభాత సమాచారం)**
హిందువులలో ఐక్యత చాటేందుకు ఆనాడు బాల గంగాధర్ తిలక్ వినాయక విగ్రహాల ప్రతిష్టపన మహోత్సవాన్ని ప్రారంభించారని, ఈ మహోత్సవానికి మరింత పవిత్రతను పెంచేందుకు యువత ఆయన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే తొలి సారిగా గణపతి దీక్ష చేపట్టిన దీక్ష దారులకు ఆయన స్వగృహంలో బుధవారం భిక్షను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ... జిల్లాలో మున్నూరు కాపు సోదరులతో పాటు ఇతర కులస్తులు 11 మందితో తొలిసారిగా ప్రారంభమైన గణపతి దీక్ష రానున్న రోజుల్లో వేలకు చేరేలా దీక్ష తీసుకునేందుకు యువత ముందుకు రావాలన్నారు. ఈ దీక్షలతో గణేష్ నవరాత్రులకు మరింత పవిత్రత పెరుగుతుందన్నారు. వినాయకుని విగ్రహా ప్రతి ష్టాపన నుండి నిమజ్జనం వరకు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ పండగలు భక్తిప్రప త్తులతో జరుపుకోవాలని సూచించారు.



# మూడు రోజుల్లో యూరియా వస్తుంది



**మంచిర్యాల, సెప్టెంబర్ 3 (ప్రభాత సమాచారం)**
నియోజకవర్గంలో రైతులు ఎరువుల కోసం పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని సంబంధిత మంత్రి, ప్రిన్సిపల్ సెక్రటరీలతో మాట్లాడి నియోజక వర్గానికి 400 టన్నుల ఎరువులు తీసుకువస్తున్నట్లు మంచిర్యాల శాసన సభ్యులు కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావు తెలిపారు. బుధ వారం లక్షెట్టిపేటలోని ఆర్ అండ్ బీ గెస్ట్ హౌజ్ ఆవరణలో దండెపల్లి, హాజీపూర్, లక్షెట్టిపేట మండలాల రైతులతో హైదరాబాద్ నుంచి ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు ఫోన్‌లో మాట్లాడారు. రెండు, మూడు రోజుల్లో ఎరువులు నియోజక వర్గానికి చేరుతాయని రైతులు ఆందోళన చెందవద్దని కోరారు.

### వరద బాధితులకు పంట నష్టపరిహారం ఇప్పిస్తా

### మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు

మంచిర్యాల నియోజకవర్గంలోని హాజీపూర్, దండేపల్లి, లక్షెట్టిపేట, మంచిర్యాల, నస్పూర్ మండలాలకు 400 మెట్రిక్ టన్నుల ఎరువులు రానున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. 8,800 బస్తాలలో దండేపల్లి మండలానికి నాలుగు వేల బస్తాలు, లక్షెట్టిపేట మండలానికి మూ డు వేలు, హాజీపూర్ మండలానికి 1200 బస్తాలు, మంచిర్యాల, నస్పూర్ మండలాలకు 500 బస్తాలు కేటాయించినట్లు వెల్లడించారు. ఈ నెల 9, 10 తేదీల్లోపు పూర్తి కోట 72 వేల బస్తాలు సరఫరా అవుతాయన్నారు. ఎరువుల కోసం క్యూలైన్‌లో పెద్ద సంఖ్యలో నిలుచుని ఇబ్బంది పడవద్దని కోరారు. గ్రామానికి ఎరువులు తీసుకువచ్చి రైతులకు ఇంటి సమీపంలోనే పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించామన్నారు. వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు పరిహారం అక్టోబర్ నెలాఖరులోపు ఇప్పిస్తానని ఎమ్మెల్యే భరో సా ఇచ్చారు. పంట నష్టం సర్వే జరిగితే తప్ప కేంద్రం పరిహారం విడుదల చేయదన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు అధికారంలో ఉన్నప్పుడు చేసిందేమి లేదని, ఇప్పటి వరకు వరద నష్టం ఇవ్వలేదని ఆరోపించారు.



## ఆర్టీఏ ఈ-చలానా ఏపీకే ఫైల్స్‌పట్ల

# అప్రమత్తంగా ఉండాలి

### ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 3 (ప్రభాత సమాచారం)**
ఆర్డీఏ ఈ-చలాన్ పేరుతో వాట్సాప్‌లో వచ్చే ఏపీకే ఫేక్ అప్లికేషన్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ జిల్లాలో వాట్సాప్ గ్రూపులలో ఇలాంటి ఏపీకె ఫైల్స్ చక్కర్లు కొడుతున్నాయని, వీటిని ఎట్టి పరిస్థితుల్లోనూ డౌన్లోడ్ చేసుకోవద్దన్నారు. వాట్సప్ గ్రూ పులలో అడ్మిన్లు ఇలాంటి వాటిని వెంటనే తొలగించాలని సూచించారు. నకిలీ అప్లికేషన్‌ల ద్వారా డేటా చోరీ, సైబర్ క్రైమ్ జరిగే ఆస్కారం ఉందన్నారు. సైబర్ క్రైంకు గురైతే 1930ని సంప్రదించాలన్నారు.

## అన్నదానం చేసిన ఎస్సై సర్తాజ్ పాషా



**బెజ్జూర్, సెప్టెంబర్ 3 (ప్రభాత సమాచారం)**
బెజ్జూర్ మండలంలోని మర్తిడి, బెజ్జూర్ ఎస్సీ కాలనీలో వినాయక మండపాలలో ఎస్సై సర్తాజ్ పాషా బుధవారం భక్తులకు అన్నదానం నిర్వహించారు. వినాయక మండపాలలో ఎస్సై అన్నదానం ఏర్పాటు చేశారు. పండగలు అందరూ కలిసి కుటుంబ సభ్యుల వలె కలిసిమెలిసి ఆనందంగా పండగలు నిర్వహించుకోవాలని ఎస్సై అన్నారు. అన్నదాన కార్యక్రమంలో కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

# 21 నుంచి దసరా సెలవులు

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 3 (ప్రభాత సమాచారం)**
రాష్ట్రంలోని పాఠశాలలకు సెప్టెంబర్ 21 నుండి అక్టోబర్ 3 వరకు దసరా సెలవులను ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తిరిగి అక్టోబర్ 4 నుంచి పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు పాఠశాల విద్యా శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.



## గని ప్రమాద ఘటనల్లో కారుణ్య
# వారసులకు గ్రేడ్-3 క్లర్క్ పోస్టులు

### సింగరేణి సంస్థ సీఎండీ ఎన్.బలరామ్

**బెల్లంపల్లి, సెప్టెంబర్ 3 (ప్రభాత సమాచారం)**
గని ప్రమాదాల్లో మరణించిన ఉద్యోగుల వారసులకు ఇచ్చే కారుణ్య నియామకాల్లో పట్టభద్రులైన అభ్యర్థులకు క్లరికల్ గ్రేడ్-3 పోస్టులను ఇవ్వడానికి సింగరేణి యాజమాన్యం అంగీకరించింది. ఈ మేరకు గుర్తింపు కార్మిక సంఘంతో జరిగిన 51వ నిర్మాణాత్మక సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలో సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో త్వరలోనే సింగరేణి గుర్తింపు కార్మిక సంఘమైన సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్‌తో యాజమాన్యం ద్వైపాక్షిక ఒప్పందం, అనంతరం డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ సమక్షంలో త్రైపాక్షిక ఒప్పందం చేసుకోనుంది. గతంలో ఈ విద్యార్హత కలిగిన వారు జనరల్ అసిస్టెంట్‌గా మాత్రమే పనిచేసే అవకాశం ఉండేది. అయితే 2009లో జారీ చేసిన సర్క్యులర్ ప్రకారం టెక్నికల్ డిగ్రీలైన మైనింగ్, మెకానికల్, ఎలక్ట్రికల్, సివిల్ ఇంజినీరింగ్, డిప్లొమా (మైనింగ్/ మెకానికల్ /ఎలక్ట్రికల్), ఐటీఐ (ఎలక్ట్రికల్/ఫిట్టర్/వెల్డర్) కోర్సులు పూర్తి చేసిన వారికి విద్యార్హతలకు తగిన ఉద్యోగాలు కల్పించడానికి అంగీకరించారు. తాజాగా డిగ్రీ అర్హతను కూడా చేర్చి గ్రేడ్ -3 క్లర్క్ ఉద్యోగాలను కల్పించడానికి నిర్ణయించడం జరిగింది. అయితే ఒకవేళ మరణించిన ఉద్యోగి కుటుంబంలో అర్హులైన టెక్నికల్ డిగ్రీ ఉన్న వారసులు లేనిపక్షంలోనే డిగ్రీ అర్హత ఉన్న వారిని గ్రేడ్ 3 క్లర్క్ పోస్టు అభ్యర్థిత్వానికి పరిశీలించడం జరుగుతుంది.

**ఇదీ నేపథ్యం..**
ఈ ఏడాది జూన్ 27వ తేదీన జరిగిన డైరెక్టర్ (పర్సనల్) స్థాయి నిర్మాణాత్మక సమావేశంలో గుర్తింపు కార్మిక సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ చేసిన ప్రతిపాదనపై యాజమాన్యం స్పందించి ఒక అధ్యయన కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ సబంధిత అంశంపై లోతుగా చర్చించి నివేదికను సమర్పించింది. దీనిపై సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ సానుకూలంగా స్పందించారు. ఇకపై గని ప్రమాదాల్లో మృతి చెందిన కార్మికుల పట్ల సానుభూతితో స్పందించి వారి కుటుంబంలో డిగ్రీ విద్యార్హతలు గల వారసులకు గ్రేడ్ 3 క్లర్క్ పోస్టుకు అర్హత కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నారు. సంస్థలో గ్రేడ్ 3 క్లర్కు పోస్టుల లభ్యతను బట్టి కంపెనీ వీరికోసం నిర్వహించే ప్రత్యేక పరీక్షలో డిగ్రీ అర్హత గల వారసులు పాల్గొనాల్సి ఉంటుందని, పరీక్షలో పాసైన వారు మాత్రమే గ్రేడ్ 3 క్లర్క్ పోస్టుల నియామకానికి అర్హత సాధిస్తారు. గ్రేడ్ 3 క్లర్క్ పోస్టుల అర్హత పరీక్షలో ఉత్తీర్ణులు కాని వారసులను క్యాటగిరి ఒకటి జనరల్ అసిస్టెంట్ గా గుర్తిస్తూ ఉద్యోగ అవకాశం కల్పించడం జరుగుతుంది.

## సైబర్ జాగృతి దివస్

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 3 (ప్రభాత సమాచారం)**
ఈ-చాలన్ ఫ్రాడ్స్, ఫేక్ ప్రొఫైల్ స్కాం, కస్టమర్ సర్వీసెస్ (ఆన్ లైన్ బుకింగ్), డిజిటల్ అరెస్ట్‌ల పై అవగాహన. డిగ్రీ కళాశాల మరియు లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయలో అవగాహన సదస్సులు నిర్వహించిన ఆదిలాబాద్ సైబర్ కార్యాలయ బృందం సైబర్ డి.ఎస్.పి హసీబుల్లా ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో సైబర్ జాగృతి దివస్ ను నిర్వహించడం జరుగుతుంది. ఈ సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాల మరియు లారీ ఓనర్స్ అసోసియేషన్ బిల్డింగ్ నందు డిజిటల్ అరెస్ట్ ల పేరుతో ప్రస్తుత సమాజంలో జరుగు నేరాలపై పూర్తి అవగాహనను విద్యార్థులకు మరియు లారీ ఓనర్స్, డ్రైవర్ లకు కల్పించి చైతన్య పరచడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా నేరాలు జరుగు పద్ధతిని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా. జే.సంగీత, లారీ ఓనర్స్ ప్రెసిడెంట్ జైసింగ్ సైబర్ క్రైమ్ సిబ్బంది బి. సురేందర్, సంతోష్, అహద్, పాల్గొన్నారు.



## భైంసాలో నేడు గణేశ్ నిమజ్జనం

**ముథోల్, సెప్టెంబర్ 3 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ జిల్లా భైంసాలో హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో గణేష్ నిమజ్జనం ఘనం గా నిర్వహించనున్నారు. ఉదయం 10.30 గంటలకు ఉత్సవ సమితి నాయకులు అధికారులు గణేష్ నగర్ లోని మున్నూరు కాపు సంఘం భవనంలో వినాయకుడికి పూజలు చేసి నిమజ్జన కార్యక్రమం ప్రారంభించనున్నారు. భారీశోభాయాత్ర అనంతరం పట్టణ సమీపంలోని గడ్డన్న జలాశయంలో నిమజ్జనం చేయనున్నారు. ఈ నేపథ్యంలో ముం దు జాగ్రత్తగా జిల్లా ఎస్పీ జానకి షర్మిల ఆధ్వర్యంలో భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్ భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయనున్నారు. ఇద్దరు డీఎస్పీలు, 28 మంది సీఐలు, 32 మంది ఎస్ఐలు ఇతరత్రా 650 మంది పోలీసులు బందోబస్తులో పాల్గొంటారని పట్టణ సీఐ గోపీనాథ్ తెలిపారు.

## వరద ప్రభావిత ప్రాంతాలలో సహాయక చర్యలు చేపట్టాలి

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 3 (ప్రభాత సమాచారం)**
జిల్లా కలెక్టర్ రాజర్షి షా బుధవారం సంబంధిత జిల్లా అధికారులతో గూగుల్ మీట్ నిర్వహించి, వరద ప్రభావిత ప్రాంతాలలో తక్షణ సహాయక చర్యలు , పునరుద్ధరణ పనుల పై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇటీవల వచ్చిన వరదల కారణంగా కలిగిన నష్టాలను సమీక్షించి, అన్ని శాఖలకు సూచనలు చేశారు. ప్రభావిత ప్రాంతాలలో రోడ్ల రవాణా సౌకర్యాలను తక్షణమే పునరుద్ధరించడం వరద బాధిత గ్రామాలలో తాగునీటి సదుపాయాలను కల్పించడం జరిగిన నష్టాలను వెంటనే అంచనా వేసి మరమ్మతులు చేపట్టడం శాఖల మధ్య సమన్వయం అత్యవసరమని ప్రత్యేకంగా హితవు పలికారు. ప్రభావిత కుటుంబాలకు సమయానుకూలంగా సహాయం , పునరావాసం అందించేందుకు అధికారులు కలిసి పని చేయాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశానికి ఏసీ రెవెన్యూ, సీఈఓ జడ్పీ, డీపీఓ,




ఆర్అండ్‌బీ, పంచాయతీ రాజ్, గిరిజన సంక్షేమ, పబ్లిక్ హెల్త్ శాఖల ఇంజనీర్లు, ఈఈ గ్రిడ్, మున్సిపల్ కమిషనర్, డీఎల్పీఓలు మరియు ఇతర అధికారులు హాజరయ్యారు.



## ఇన్‌ఫ్లో ఎప్పకప్పుడు
# పర్యవేక్షించాలి

### మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, సెప్టెంబర్ 3 (ప్రభాత సమాచారం)**
జిల్లాలో ఎడతెరిప లేకుండా వర్షాలు కురుస్తున్నందున ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి వచ్చే వరద నీటి ఇన్ ఫ్లో ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని హాజీపూర్ మండలం లోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి చేరుతున్న వరదనీటి పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఎగువన ఉన్న ఎస్ ఆర్ ఎస్ పి, కడెం ప్రాజెక్టుల నుండి వరద నీటిని విడుదల చేయడంతో ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి వరద నీటి చేరిక పెరుగుతుందని, ఈ నేపథ్యంలో జిల్లాలో కురిసిన వర్షాలతో వాగులు, చెరువుల నుండి సైతం వరద నీరు ప్రాజెక్టులోకి రావడంతో ఇన్ ఫ్లో అధికంగా ఉంటుందని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, ప్రాజెక్టు నుండి నీటి అవుట్ ఫ్లో వివరాలను ఎప్పటికప్పుడు అందించాలని తెలిపారు. లోతట్టు, వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తూ అధికారుల సమన్వయంతో రక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# నిమజ్జనోత్సవాలకు పోలీసులు సంసిద్ధం

### కుమ్రంభీం ఆసిఫాబాద్ ఎస్పీ కాంతిలాల్

**కాగజ్‌నగర్, సెప్టెంబర్ 3 (ప్రభాత సమాచారం)**
జిల్లాలో గణేష్ నిమజ్జనోత్స వాలను శాంతి భద్రతల మధ్య సాఫీగా నిర్వహించేందుకు జిల్లా పోలీస్ శాఖ సంసిద్ధంగా ఉందని ఎస్పీ కాంతిలాల్ పాటిల్ తెలిపారు. బుధవారం కాగజ్‌నగర్‌లోని నిమజ్జన ప్రదేశమైన పెద్దవాగును సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్ల,ఏఎస్పి చిత్తరంజన్ తో కలిసి పరిశీలించి, సంబంధిత అధికారులకు, పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గణేష్ శోభాయాత్ర జరిగే మార్గాల్లో ఎలాంటి ఆటంకా లు లేకుండా అన్ని రకాల చర్యలు చేపట్టాలని, నిమర్జన ప్రాంతం వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా ప్రత్యేక భద్రతా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నిమర్జన ప్రాంతం వద్ద వినాయక ప్రతిమల నిమర్జనాల కోసం క్రేన్లు, లైట్ల ఏర్పాటు, నిమజ్జన ఘాట్ల వద్ద ఈతగాళ్లతో పాటు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. జిల్లా ప్రజలందరూ నిబంధనలు పాటిస్తూ, పోలీసులు



ఇచ్చే సూచనలకు సహకరించి గణేష్ నిమజ్జనోత్సవాలను విజయవంతంగా జరగడానికి సహకరించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజేందర్, రూ టరల్ సిఐ కుమారస్వామి, టౌన్ సిఐ ప్రేమ్‌కుమార్, డి.వై.ఈ.ఈ రమాదేవి, రూరల్ ఎస్సై సందీప్ పాల్గొన్నారు.

**నమ్మకం కలిగించేందుకే కవాతు...**
గణేష్ నిమజ్జనం వేడుకల నేపథ్యంలో ఎఎస్పీ చిత్తరంజన్ ఆధ్వర్యంలో 100 మంది పోలీసులు కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రధాన వీధుల్లో బుధవారం కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఎస్పీ మాట్లాడుతూ.. నిమజ్జనం సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భద్రత కల్పిస్తారని ప్రజలకు భరో సా కల్పించడానికి కవాతు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సిఐలు, ఎసైలు సిబ్బంది పాల్గొన్నారు.



## రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది

### కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలచారి భరోసా

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 3 (ప్రభాత సమాచారం)**
భారీ వర్షాల వల్ల నష్టపోయిన రైతుల ఏవరు ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం అండగా ఉంటుందని కేంద్ర మాజీ మంత్రి వేణుగోపా ల్‌చారి అన్నారు. జిల్లాలో ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆయన బుధవారం పర్యటించారు. బోథ్ నియోజకవర్గంలోని తలమడుగు మండలంలో గల కజ్జర్ల, రుయ్యాడి గ్రామంలో దెబ్బ తిన్న పంట పొలాలను మాజీ జడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి, బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్‌లతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించి, నష్టపోయిన రైతులను కలిసి వారి పంట పొలాలను పరిశీలించి ధైర్యం చెప్పారు. వరదల వల్ల దెబ్బతిన్న రోడ్లను పరిశీలించి సంబంధిత శాఖ అధికారాలతో మాట్లాడారు. అనంతరం వేణుగోపాల్‌చారి మాట్లాడుతూ నష్టపోయిన రైతులు ఎవరు ఆందోళన చెందొద్దు అని భరోసా కల్పించారు. క్షేత్రస్థాయిలో పర్యటించి వ్యవసాయ అధికారులు పక్కగా నష్టపోయిన రైతుల వివరాలు నమోదు చేయాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టి కి నష్టం వివరాలు తీసుకెళ్లి, త్వరగా నష్టపరిహారం అందేవిదంగా, రోడ్ల మరమ్మతులు చేసే విధంగా చూస్తానని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లోక ప్రవీణ్ రెడ్డి, సంతోష్, కృష్ణారెడ్డి, కమలాకర్ తో పాటు రైతులు, అధికారులు పాల్గొన్నారు.

## నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ డ్రైవర్



**నిర్మల్, సెప్టెంబర్ 3 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ ఆర్టీసీ డిపోకు చెందిన డ్రైవర్ సీసీ శేఖర్ బుధవారం తన నిజాయితీని చాటుకున్నారు. నిజామాబాద్ నుండి మంగళవారం రాత్రి నిర్మల్ కు వస్తుండగా ముక్కాలకు చెందిన లక్ష్మణ్ లాప్టాప్ మర్చిపోయి సొంత గ్రామంలో దిగిపోయారు. నిర్మల్ డిపోలో బస్సులు పెడుతుండగా లాప్టాప్ కనిపించడంతో ఆర్టీసీ సిబ్బందికి అప్పగించి అందులో ఉన్న ఫోన్ నెంబర్ ఆధారంగా లబ్ధిదారునికి పిలిపించి అప్పగించడం జరిగిందని నిర్మల్ డిఎం పండరీ తెలిపారు

## వాట్సాప్ ఫిర్యాదులపై స్పందన

**నిర్మల్, సెప్టెంబర్ 3 (ప్రభాత సమాచారం)**
గటీజీ ఎంపీటీసీఎల్ ఆధ్వర్యంలో నిర్మల్ జిల్లాలో విద్యుత్ వినియోగదారులకు మరింత మెరుగైన సేవలను అందించేందుకు వాట్సాప్ చాట్ సేవలు అందుబాటులో ఉన్నాయని జిల్లా విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజనీర్ సలియానాయక్ అన్నారు. నిర్మల్ జిల్లాలో విద్యుత్ పరమైన సమస్యల పరిష్కారం కోసం విద్యుత్ సిబ్బంది పనితీరుపై ఇతర సేవలు కావాలన్నా 79016 28348 ఫోన్ నెంబర్ వాట్సాప్ కు పేరు సమస్య ఊరు తదితర వివరాలు పంపితే ఆ సమస్య పరిష్కారానికి విద్యుత్ సిబ్బంది సత్కారం చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. దీనికి తోడు 19 12 టోల్ ఫ్రీ నెంబర్ కూడా అందుబాటులో ఉందని వివరించారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

### నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్, సెప్టెంబర్ 3 (ప్రభాత సమాచారం)**
ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, వనమహోత్సవం, గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో నిర్మాణంలో ఉన్న ఇండ్ల కు సంబంధించిన వివరాలను హౌసింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇండ్ల నిర్మాణ పనులు ప్రారంభించిన వెంట వెంటనే పనులు పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులపై నిరంతరం



పర్యవేక్షించి, ఇండ్ల నిర్మాణం త్వరిత గతిన పూర్తి అయ్యేలా చూడాలన్నారు. ఎక్కడ కూడా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి సంబంధించి ఇసుక కొరత రాకుండా చూడాలన్నారు. నిర్మాణానికి డబ్బులు లేని ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మహిళా స్వయం సంఘాల ద్వారా రుణాలు అందించాలని తెలిపారు. జిల్లాలో వన మహోత్సవం కార్యక్రమాన్ని వెంటనే పూర్తిచేయాలన్నారు. శాఖల వారీగా కేటాయించిన మొక్కలు నాటే లక్ష్యం, నాటిన మొక్కలకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మొక్కలు నాటిన వెంటనే సంబంధిత సైట్ లో నమోదు చేయాలన్నారు. జిల్లాలో మొక్కలు నాటే ప్రక్రియ దాదాపు పూర్తి అయ్యిందని, మిగిలిపోయిన లక్ష్యాన్ని వెంటనే పూర్తి చేయాలని అన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, ఇటీవలి భారీ వర్షాలు కురిసినందున గ్రామాల్లో మెరుగైన పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు. ఎక్కడ కూడా మురుగు నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. గ్రామాల్లో, అన్ని ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఎప్పటికప్పుడు ఫాగింగ్ చేయాలన్నారు. నీరు అధికంగా నిల్వ ఉండే చోట దోమలు వ్యాప్తి చెందకుండా ఉండేందుకు ఆయిల్ బాల్స్ వేయాలని చెప్పారు. ఇటీవల జిల్లాలో భారీ వర్షాలు కురిసి, వరదలు సంభవించినప్పుడు అధికారులు క్షేత్ర స్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండి, వారికి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకున్నందుకు అధికారులందరిని కలెక్టర్ అభినందించారు. ఈ సమావేశంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, పంచాయతీ అధికారి శ్రీనివాస్, జెడ్పీ సీఈవో గోవింద్, డీఆర్డీవో విజయలక్ష్మి, పిడి హౌసింగ్ రాజేశ్వర్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి




**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 3 (ప్రభాత సమాచారం)**
జిల్లాలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అదనపు కలెక్టర్ దీపక్ తివారి, సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లాతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బుధవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, ఉపాధి హామి పథకం, ఏపీఓలు, సెర్ప్ ఏపీఎంలు, హౌసింగ్ ఇంజనీరింగ్ అధికారులతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, లబ్ధదారులకు బ్యాంకు లింకేజి ద్వారా రుణ సదుపాయం, వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటడం, పారిశుధ్య పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇందరిమ్మ ఇళ్ల పనులను వేగవంతం చేయాలని చెప్పారు. బేసిమెంట్ నిర్మాణం ఆలస్యం చేసిన వారిని గుర్తించి బ్యాంకు లింకేజీ మండల సమాఖ్య ద్వారా ఇళ్ల నిర్మాణం ప్రారంభించాలని సూచించారు. వారికి లక్ష రూపాయల రుణం అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. విడతల వారీగా లబ్ధిదారుల ఖాతాలో నిధులు జమ చేసేందుకు ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ప్రధానమంత్రి జన్ మన్ పథకం కింద పీవీటీజీలకు 100 శాతం ఇళ్లు మంజూరు చేశామని అన్నారు. అర్హులైన లబ్ధిదారుల జాబితా అందించాలని తెలిపారు. పనుల జాతర క్యాక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాల భవనాలు, పశువుల షెడ్లు, పౌల్ట్రీ షెడ్, గోట్ షెడ్‌ల నిర్మాణం, ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలని తెలిపారు.


ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల రహదారులపై ఏర్పడ్డ గుంతలకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని గ్రామాలలో పారిశుధ్య పనులు నిరంతరం నిర్వహించాలని తెలిపారు. గుంతలలో వర్షపు నీరు నిలువకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని దోమల వృద్ధిని అరికట్టే విధంగా అయిల్‌బాల్స్, బ్లీచింగ్ పౌడర్ పిచికారి చేయాలని తెలిపారు. ఆయిల్‌పామ్ పంటలను సాగుపై రైతులకు అవగాహన కల్పించి సాగు విస్తీర్ణం పెంపొందించే విధంగా ప్రోత్సహించాలని సూచించారు. వనమహోత్సవం 2025 కార్యక్రమంలో భాగంగా జిల్లాకు కేటాయించిన లక్ష్యాలను త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావు, జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, హౌసింగ్ పీడీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## తప్పిన ఘోర ప్రమాదం

### వరదల్లో కొట్టుకోపోయిన ఆటో
### సురక్షితంగా ప్రాణాలతో బయటపడ్డ 10 మంది ప్రయాణికులు

**ఇంద్రవెల్లి, సెప్టెంబర్ 3 (ప్రభాత సమాచారం)**
ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం సాత్వాజిగూడ వాగులో ఘోర ప్రమాదం తప్పింది. ప్రయాణికులతో వెళ్తున్న ఆటో వాగులో బోల్తా పడడంతో ప్రయాణికులు సురక్షితం బయటపడ్డారు. ఇంద్రవెల్లి మండల కేంద్రం నుంచి బుస పటం మధ్య ఉన్న సత్వాజిగూడ వద్ద వాగు పొంగి పొర్లుతుంది. బుధవారం మధ్యాహ్నం పదిమంది ప్రయాణికులతో వెళుతున్న ఆటో డ్రైవర్ నిర్లక్ష్యంతో వాగును దాటించే ప్రయత్నం చేస్తుండగా నీటి ప్రవాహానికి ఆటో వాగులో పడిపోయింది. గమనించిన స్థానికులు, ప్రయాణికులను సురక్షితంగా బయటికి తీసుకువచ్చారు. అనంతరం ఆటోను జేసీబీ, పోలీసుల సహాయంతో బయటకు తీశారు. భారీ వర్షాలతో పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు, వంతెనల వద్ద ప్రమాదకరంగా ప్రయాణించి ప్రమాదాలకు లోనుకావొద్దని పోలీసులు గ్రామస్థులకు సూచించారు.




## మనస్తాపంతో ఉరి వేసుకుని యువకుడి బలవన్మరణం

**రామకృష్ణాపూర్, సెప్టెంబర్ 3 (ప్రభాత సమాచారం)**
ఆర్థిక ఇబ్బందులు తాళలేక యువకుడు మనస్తాపనికి గురై మృతి చెందిన ఘటన బుధవారం రామకృష్ణాపూర్ పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... స్థానిక శ్రీనివాస నగర్‌కు చెందిన కుషన నవీన్(33) ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరివేసుకుని మృతి చెందాడు. మృతునికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్సై రాజశేఖర్ తెలిపారు.



# MOVIE TIME

గురువారం । 4 సెప్టెంబర్ । 2025






## కెన్యా మంత్రిని కలిసిన రాజమౌళి..

'RRR' తర్వాత రాజమౌళి దర్శకత్వంలో రాబోతున్న మోస్ట్ అవైటెడ్ ప్రాజెక్ట్ 'SSMB29'. తొలిసారి రాజమౌళి- మహేష్ బాబు కాంబినేషన్ తెరకెక్కుతున్న ఈ ప్రాజెక్ట్ భారీ అంచనాలు నెలకొన్నాయి. రాజమౌళి కూడా ఈ సినిమాను ఇంటర్నేషనల్ స్థాయిలో తెరకెక్కించే ప్లాన్ లో ఉన్నారు. హాలీవుడ్ చిత్రం 'ఇండియానా జోన్స్' తరహాలో ఇది ఉంటుందని వార్తలు వస్తున్నాయి. అంతేకాదు ఇదొక విజువల్ వండర్ గా ఉండబోతుందని టాక్. ఇందుకోసం రాజమౌళి చిత్రబృందం దేశవిదేశాల్లోని అందమైన లొకేషన్స్ ని షూటింగ్ కోసం ఎంపిక చేసుకుంటున్నారు. ఇటీవలే ఈస్ట్ ఆఫ్రికాలోని కెన్యాలో కొన్ని కీలక సన్నివేశాలకు సంబంధించిన షూటింగ్ పూర్తి చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ రాజమౌళి కెన్యా విదేశాంగ మంత్రి ముసాలియా ముదవాడిని మర్యాదపూర్వకంగా కలిశారు. షూటింగ్ కి కావాల్సిన అనుమతులు ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే కాసేపు కాసేపు ముచ్చటించిన రాజమౌళి సినిమాకు సంబంధించిన పలు విశేషాలను పంచుకున్నారు. ఈ సమావేశానికి సంబంధించిన ఫొటోలను మంత్రి ముదావాది తన ట్విట్టర్ లో పంచుకున్నారు. కెన్యాలోని సుందరమైన ప్రదేశాలను తన చిత్రం ద్వారా ప్రపంచానికి పరిచయం చేస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈమేరకు రాజమౌళిపై ప్రశంసలు కురిపిస్తూ ఎక్స్ లో ట్వీట్ చేశారు. "ప్రపంచంలోనే గొప్ప దర్శకులలో ఒకరైన ఎస్.ఎస్. రాజమౌళికి గత పదిహేను రోజులుగా కెన్యా వేదికగా మారింది. భారతీయ దర్శకుడిగా, కథకుడిగా, రచయితగా ఆయన సినిమాలు ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. 20 ఏళ్లకు పైగా సినీ కెరీర్ లో రాజమౌళి బలమైన కథాంశాలు, అద్భుతమైన విజువల్స్, లోతైన అంశాలతో సినిమాలు తీయడంలో పేరు పొందారు. తూర్పు ఆఫ్రికాలోని చాలా ప్రాంతాలను పరిశీలించిన తర్వాత.. 120 మంది సభ్యులతో కూడిన రాజమౌళి టీమ్ కెన్యాను ఎంచుకుంది. ఆఫ్రికాలో చిత్రీకరించాలిసిన సన్నివేశాల్లో దాదాపు 95% షూటింగ్ ఇక్కడే చేశారు. " 'మసాయి మారా మైదానాల నుంచి సుందరమైన నైవాషా, సంబురు, అంబోసెలి వంటి కెన్యా అందమైన ప్రాంతాలు ఇప్పుడు ఆసియాలోనే అతిపెద్ద సినిమాలో భాగం కానున్నాయి. రాజమౌళి SSMB29 దాదాపు 120 దేశాల్లో విడుదల కానుంది. అలాగే ప్రపంచవ్యాప్తంగా ఒక బిలియన్ ప్రేక్షకులకు చేరుకుంటుందని అంచనా! కెన్యాలో షూటింగ్ చేయాలనే ఈ నిర్ణయం కేవలం సినిమాకు సంబంధించినది మాత్రమే కాదు. మా దేశ గొప్పతనాన్నీ, ఆతిథ్యాన్ని, సుందరమైన ప్రదేశాలను ప్రపంచానికి చాటి చెప్పే వేదిక ఈ చిత్రం కానుంది. ఈ రోజు చిత్రబృందం నెక్స్ట్ షెడ్యూల్ కోసం ఇండియాకు తిరిగి వెళ్తుంది. 'SSMB 29' ద్వారా కెన్యా తన అందమైన ప్రదేశాలను ప్రపంచానికి చూపించడానికి సిద్ధంగా ఉంది'' అంటూ ట్వీట్ చేశారు కెన్యా మంత్రి ముదావాది.

## భయపెడుతున్న కిష్కిందపురి ట్రైలర్!



బెల్లంకొండ శ్రీనివాస్ ప్రధాన పాత్రలో నటించిన 'కిష్కిందపురి' ట్రైలర్ విడుదలైంది. "ఊరికి ఉత్తరాన దారికి దక్షిణాన.. పశ్చిమ దిక్కు ప్రేతాత్మ అంటూ మొదలైన ఈ ట్రైలర్ ఆసక్తికరంగా సాగింది. ట్రైలర్ చూస్తుంటే.. ఇదొక హారర్ మిస్టరీ థ్రిల్లర్ గా రూపొందినట్లు తెలుస్తోంది. దెయ్యాల, ప్రేతాత్మల గురించి తెలుసుకోవాలనే ఆసక్తిని ఉన్న కొంతమందిని 'కిష్కిందపురి' అనే ఒక హాంటెడ్ హౌజ్ లో వెళ్తారు. అక్కడికి వెళ్లిన తర్వాత అందులో నిజంగానే ఒక ప్రేతాత్మ ఉన్నట్లు తెలుస్తోంది. ఆ ప్రేతాత్మ హీరోయిన్ అనుపమ శరీరంలోకి ప్రవేస్తుంది. ఆ తర్వాత హీరో ఆ ప్రేతాత్మ నుంచి అనుపమను ఎలా కాపాడతాడు? అసలు 'కిష్కిందపురి' హాంటెడ్ హౌజ్ వెనుక ఉన్న రహస్యమేంటి? అనేది సినిమా. ట్రైలర్ లో 'ఆ రాక్షస శక్తిని ఎవరూ ఆపలేరు..' అనే డైలాగ్స్ ఆసక్తికరంగా ఉన్నాయి.





## లంగావోణీలో హొయలొలికిస్తున్న ఐశ్వర్య మీనన్..

హీరోయిన్ ఐశ్వర్య మీనన్ లంగావోణీలో హొయలొలికిస్తున్న ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఈ లంగావోణీలో క్యూట్ గా భలేగా ఉందని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. వీటికి సంబంధించిన ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. లంగావోణీలో హొయలొలికిస్తున్న ఐశ్వర్య మీనన్. క్యూట్ లుక్స్ తో అదిరిపోయిన ఐశ్వర్య. లంగావోణీలో బుట్టబొమ్మలా కనిపిస్తున్న బ్యూటీ. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఫొటోలు. భలే క్యూట్ గా ఉందని నెటిజన్లు కామెంట్లు.



## అప్పుడు పిన్నిగా.. ఇప్పుడు తల్లిగా...

మీకు పవన్ కళ్యాణ్ 'బాలు' సినిమా గుర్తుందా? ఇందులో శ్రేయా-పవన్ కళ్యాణ్ తో పాటు వారితో కనిపించే చైల్డ్ ఆర్టిస్ట్స్ చెర్రీ (తేజ సజ్జా), లిల్లీ (కావ్య కళ్యాణ్ రామ్) పాత్రలు కూడా గుర్తుండే ఉంటాయి. పవన్ కళ్యాణ్ అన్న కొడుకుగా తేజ సజ్జా, శ్రేయ మేనకోడలిగా కావ్య నటించారు. సినిమాలో ఈ నలుగురి మధ్య వచ్చే సన్నివేశాలు ప్రేక్షకులను తెగ ఆకట్టుకున్నాయి. ఇప్పటికీ సోషల్ మీడియాలో ఈ సన్నివేశాలకు సంబంధించిన క్లిప్స్ వైరల్ అవుతూనే ఉంటాయి. అయితే అప్పుడు పవన్ గర్ల్ ఫ్రెండ్ గా తేజ సజ్జకు పిన్ని వరుసలో కనిపించిన శ్రేయా.. ఇప్పుడు తల్లిగా కనిపించబోతుంది. తేజ సజ్జా హీరోగా నటించిన లేటెస్ట్ మైథలాజికల్ థ్రిల్లర్ 'మిరాయ్' లో శ్రేయా తేజకు తల్లిగా కనిపించబోతుంది. ఈ మేరకు తాజాగా మూవీ నుంచి శ్రేయా ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల చేశారు మేకర్స్. ''ప్రతి సూపర్ హీరో ప్రయాణం వెనుక ఒక శక్తివంతమైన తల్లి ఉంటుంది'' అంటూ ఆమె పాత్రను ఇంట్రడ్యూస్ చేశారు. ఇందులో ఇందులో శ్రేయా పాత్ర పేరు అంబిక! పోస్టర్ లో శ్రేయా లుక్ చూస్తుంటే.. కొన్ని అతీతమైన శక్తులు కలిగిన మహిళగా శ్రేయా పాత్ర పవర్ ఫుల్ గా ఉండబోతుందని తెలుస్తోంది. కార్తిక్ ఘట్టమనేని దర్శకత్వం వహించిన ఈ చిత్రం సెప్టెంబర్ 12న ప్రపంచవ్యాప్తంగా థియేటర్స్ లో విడుదల కానుంది. తెలుగు, హిందీ, తమిళ్, కన్నడ, మళయాళంతో పాటు స్పానిష్, జాపనీస్, కొరియా వంటి ఇతర అంతర్జాతీయ భాషల్లో కూడా అందుబాటులోకి రానుంది. డైరెక్టర్ కార్తిక్ ఘట్టమనేని గతంలో సూర్య వర్సెస్ సూర్య, ఈగల్, చౌర్య పాటం వంటి సినిమాలు చేశారు. సినిమా విడుదల దగ్గరపడుతున్న నేపథ్యంలో మూవీ ప్రమోషన్స్ షురూ చేశారు. ఇప్పటికే ట్రైలర్, టీజర్, సాంగ్స్ విడుదల చేయగా సినిమాకు సూపర్ బజ్ క్రియేట్ చేశాయి. ఇందులో తేజ సజ్జ ప్రపంచాన్ని ఒక చీకటి శక్తి నుంచి కాపాడే యోధుడిగా కనిపించబోతున్నాడు. డైరెక్టర్ కార్తిక్ ఘట్టమనేని ఈ చిత్రాన్ని ఒక పురాతన ఇతిహాసం ఆధారంగా రూపొందించారు.

# మళ్లీ దంచికొడుతున్న వానలు

- జిల్లాలో పొంగిపొర్లుతున్న వాగులు
- నిండుకుండల్లా తలపిస్తున్న ప్రాజెక్టులు...
- ప్రాణహిత, పెన్‌గంగ ఉగ్రరూపం
- వరదల్లో కొట్టుకుపోయిన ఆటో..
- సురక్షితంగా ప్రాణాలతో బయట పడ్డ ప్రయాణికులు
- మరో మూడు రోజుల పాటు భారీ వర్షాలు
- బంగాళాఖాతంలో అల్పపీడనం
- ఎల్లో అలర్ట్ జారీ
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..
- వాతావరణ శాఖ హెచ్చరిక



**ఆదిలాబాద్, సెప్టెంబర్ 3 (ప్రభాత సమాచారం)**
జిల్లా వ్యాప్తంగా గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే వందల ఎకరాల్లో పంట నీటములుగా, కోత గురైన రోడ్లు, తెగిన బ్రిడ్జిలతో రాకపోకలు లేక అవస్థలు పడుతున్నారు. తాజాగా బుధవారం జిల్లా కేంద్రం తో పాటు వివిధ మండలాల్లో ఎడ తెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు వాగు లు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. పలు లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లల్లోకి వరద నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అటు ప్రాజెక్టులకు సైతం భారీగా వరద నీరు వచ్చి చేరడంతో ప్రాజెక్టులన్ని నిండుకుండల్లా దర్శనమిస్తున్నాయి. సాత్నాల ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో పెరగడంతో అప్రమత్తమైన అధికారులు ఒక గేటును ఎత్తివేసి నీటి ని దిగువకు వదిలారు. భారీ వర్షాలకు ఇంద్రవెల్లి మండలంలోని సట్వాజీ గూడా వాగు ఉప్పొంగి ప్రవహిస్తుంది. ఓ ఆటో డ్రైవర్ వాగు దాటే ప్రయత్నం చేయగా వరద తాకిడి పెరగడంతో ఆటో బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న 8 మంది ప్రయాణికులు కొంత దూరం వరకు వరదలో కొట్టుకుపో గా స్థానికులు వారిని రక్షించాగా, ప్రయాణికులు ప్రాణాలతో బయటపడడంతో అంద రూ ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నారు. పలువురు ప్రయాణికులకు స్వల్ప గాయాలు కాగా.. వారికి స్థానిక ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలానికి చేరుకొన్న పోలీసులు, గ్రామ పంచాయతీ సిబ్బంది నుజ్జు అయిన ఆటోను బయటికి తీశారు. ప్రమాద సూచికలు ఏర్పాటు చేసి



రాకపోకలను నిలిపి వేశారు. భారీ వర్షాలు కురుస్తున్న సమయంలో ప్రజలు వాగులు, వంకలు దాటే ప్రయత్నం చేయకూడదని పోలీసులు సూచించారు. అత్యవసర సమయంలో తమకు ఫోన్ ద్వారా సమాచారం అందించాలన్నారు.

**మహారాష్ట్రకు రాకపోకలు బంద్...**
మహారాష్ట్ర నుండి వరద నీరు భారీగా పెనుగంగలో చేరడంతో నీటి ప్రవాహం పెరుగుతూ వస్తుంది. సిర్పూర్ (టి) మండలంలోని వెంకట్రావుపేట మీదనుండి మహారాష్ట్రకు వెళ్లే మార్గమధ్యంలోని పోడసా వదల బ్రిడ్జిపై నుండి వద్దని ప్రవహిస్తుండడంతో మహారాష్ట్రకు రాక పోకలు నిలిచిపోయాయి. భారీగా వరద నీరు రావడంతో అధికారులు దారిని ముగించారు. పెద్ద ఎత్తున పెనుగంగలోకి వరద నీరు రావడంతో బ్యాక్ వాటర్‌తో పెనుగంగా పరివాహక గ్రామాల ప్రజలు ఆందోళన చెం



దుతున్నారు. పెనుగంగ పరివాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పెనుగంగవైపు ఎవరు కూడా వెళ్లావద్దని అధికారులు సూచిస్తున్నారు.

**పెన్‌గంగ ఉగ్రరూపం...**

**సిర్పూర్ (టి), సెప్టెంబర్ 3 (ప్రభాత సమాచారం)**
మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాల మూలంగా సిర్పూర్(టి) మండలం సరిహద్దులో ఉన్న పెన్‌గంగ బుధవారం ఉధృతంగా ప్రవహిస్తోంది. భారీ వర్షాలతో వరదల నేపథ్యంలో అక్కడి ప్రాజెక్టుల గేట్లు ఎత్తడంతో పెన్‌గంగ ఉగ్రరూపం దాల్చింది. దీంతో మండల సరిహద్దులోని అంతరాష్ట్ర పోడ్సా వంతెనను ఆనుకుని,



హుడ్కిలి లో లెవల్ వంతెనపై బ్యాక్ వాటర్ ప్రవహించడంతో రాక పోకలు నిలిచి పోయాయి. ఈ నేపథ్యంలో సిర్పూర్(టి) మండలం హుడ్కిలికి గ్రామానికి చెందిన ముగ్గురు నిండు గర్భిణులు ఆత్రం మమత, టేకం ప్రతిక్ష, కిర్మురె సబ్బంగిలు ఉండడంతో విషయం తెలుసుకున్న తహసీల్దార్ రహీముద్దీన్ ముందు జాగ్రత్తగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వారిని హుడ్కిలి గ్రామం నుంచి ట్రాక్టర్‌పై వాగు దాటించి సిర్పూర్(టి) మండలంలోని నవేగాం సబ్ సెంటర్ అంబులెన్స్‌లో తరలించారు. ఈ ముగ్గురికి ఈ నెల 16, 22, 25తేదీల్లో కాన్పు సమయం ఉందని వైద్య సిబ్బంది తెలిపారు.. గర్భిణీలకు ప్రస్తుతం సబ్ సెంటర్లలో వైద్య చికిత్సలు అందిస్తున్నారు. ఎస్సై కమలాకర్, ఎంపీడీఓ సత్యనారాయణలను రెండు చోట్ల బందో బస్తు ఏర్పాటు చేసి సాయంత్రం 6 తరువాత ఎవరు కూడా వాగు దాటే ప్రయత్నం చేయవద్దని సూచించారు.





# మహిళలను వేధిస్తున్న ముగ్గురిపై కేసు

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 3 (ప్రభాత సమాచారం)**
గణపతి మండపాలను దర్శించుకొని పూజలు చేసుకోవటానికి వచ్చే మహిళలను వేధిస్తూ వెకిలి చేష్టలు చేస్తున్న ముగ్గురిపై వన్ టౌన్ పోలీసు స్టేషన్లో కేసు నమోదు చేసినట్లు ఆదిలాబాద్ షీ టీం ఇన్చార్జి బి.సుశీల (ఏఎస్ఐ) తెలిపారు. ఆమె మాట్లాడుతూ.. బల్లు(ఖానాపూర్), అవేజ్(బొక్కలగూడ), సంతోష్ (కుమ్మరివాడ) యువకులు ద్విచక్రవాహనాలపై తిరుగుతూ గణేష్ మండపాల వద్దకు వచ్చే మహిళల వెనుక తిరుగుతూ వారిని వేధించేటప్పుడు షీటీం సభ్యులు వాణిశ్రీ(హెచ్సీ), సిబ్బంది మహేశ్, రోహిణి, లావణ్య వల పన్ని అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. అనంతరం వారిపై వన్ టౌన్ లో కేసు నమోదు చేయించినట్లు తెలిపారు. పట్టణంలో రద్దీగా ఉండే ప్రాంతాల్లో షీటీం సభ్యులు మహిళలకు రక్షణగా ఉంటున్నారన్నారు. ఎవరైనా వేధించినట్లయితే డయల్ 100 లేదా 8712659953కి సమాచారం అందిస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల బరిలో బీసీ పార్టీ

**మంచిర్యాల, సెప్టెంబర్ 3 (ప్రభాత సమాచారం)**
రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలంగాణ పొలిటికల్ బీసీ జేఏసీ పోటీ చేస్తుందని, గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతుందని తెలంగాణ పొలిటికల్ బీసీ జేఏసీ మంచిర్యాల జిల్లా ఇంచార్జి మహేష్ వర్మ అన్నారు. బుధ వారం జిల్లా కేంద్రంలోని బీసీ జేఏసీ కార్యాలయంలో తెలంగాణ పొలిటికల్ బీసీ జేఏసీ ఆధ్వర్యంలో స్థానిక సంస్థల ఎన్నికల విషయంపై నిర్వహించిన కీలక సమావేశంలో ఆయన మాట్లాడారు. తీన్మార్ మల్లన్న సారధ్యంలో బీసీ రాజ్యాధికారమే లక్ష్యంగా తెలంగాణ పొలిటికల్ బీసీ జేఏసీ ముందుకు వెళుతుందని స్పష్టం చేశారు. ఎంపిటిసి, జెడ్పిటిసి, సర్పంచ్ లుగా పోటీ చేయాలని అనుకుంటున్న బీసీ, బహుజనుల అభ్యర్థులకు తెలంగాణ పొలిటికల్ బీసీ జేఏసీ అండగా ఉంటుందన్నారు.


**మూడు పార్టీలు ప్రజలను మోసం చేస్తున్నాయి...**
కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు బీసీలను, బహుజనులను మోసం చేస్తున్నాయని తెలంగాణ పొలిటికల్ బీసీ జేఏసీ మంచిర్యాల జిల్లా ఇంచార్జి మహేష్ వర్మ అన్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో భాగంగా బీసీలకు 42 శాతం అన్నిరంగాల్లో అమలుచేస్తామని, తొమ్మిదవ షెడ్యూల్ లో పొందు పరుస్తామని హామీ ఇచ్చి కేవలం రాజకీయ లబ్ధి కొరకే ఎన్నికల్లో



వాటా ఇచ్చి చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నడూ లేని విధంగా కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి పార్టీలు కేవలం రాజకీయ లబ్ధి పొందేందుకు మాత్రమే బీసీ వాదాన్ని వినిపిస్తున్నాయి తప్ప, బీసీల పట్ల ఎలాంటి చిత్తశుద్ధి లేదనే విషయాన్ని ఈ బీసీ సమాజం గమనిస్తుందని అన్నారు. యువత రాజకీయాల్లోకి రావాలని తెలంగాణ పొలిటికల్ బీసీ జేఏసీ మంచిర్యాల జిల్లా ఇంచార్జి మహేష్ వర్మ పిలుపునిచ్చారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుదామని, ఎన్నికల్లో పోటీచేసే ఆలోచన ఉన్న అభ్యర్థులు మంచిర్యాల జిల్లా కేంద్రంలోని తెలంగాణ పొలిటికల్ బీసీ జేఏసీ కార్యాలయంలో మీ వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు.

# కాగజ్‌నగర్‌లో బంగారం చోరీ

**కాగజ్‌నగర్, సెప్టెంబర్ 3 (ప్రభాత సమాచారం)**
కాగజ్‌నగర్ పట్టణంలోని సరసిల్క్ కాలనీకి చెందిన షేక్ నబీ ఇంట్లో దొంగలు చొరబడి 2.5 తులాల బంగారాన్ని చోరీ చేశారు. మంగళవారం రాత్రి ఎవరు లేకపోవడంతో తాళం పగులగొట్టి లోపలికి చొరబడి బీరువాలోని 2.5 తులాల బంగారాన్ని దుండగులు దొంగిలించారు. ఉదయం ఇంటికి వచ్చిన ఆమె గమనించి స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ సురేష్ సంఘటన స్థలానికి చేరుకుని విచారణ ప్రారంభించారు.





# ఆదిలాబాద్‌కు ఎక్కువ నిధులివ్వండి

## మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

**నిర్మల్, సెప్టెంబర్ 3 (ప్రభాత సమాచారం)**
ఇటీవల ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో రైతులకు ప్రజలకు తీవ్ర నష్టం జరిగిందని ప్రభుత్వం ఎక్కువ మొత్తంలో పరిహారం అందించాలని మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావును కలిసి విన్నవించారు. బుధవారం సచివాలయంలో కలిసి ఉమ్మడి జిల్లాలో జరిగిన పంట నష్టం దెబ్బతిన్న రోడ్లు తెగిపో యిన చెరువులు కూలిపోయిన ఇన్న వివరాలను వివరించి ఉమ్మడి ఆలాబాద్ జిల్లాకు ఎక్కువ నిధులు కేటాయించేలా చూడాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో పత్తిరెడ్డి రాజశేఖర్ రెడ్డి ఆత్మీరా శ్యామ్ నాయక్ నారాయణ రెడ్డి లోక భూమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బైక్ అదుపు తప్పి బోల్తా.. ఇద్దరికి గాయాలు

**సిర్పూర్ (టీ), సెప్టెంబర్ 3 (ప్రభాత సమాచారం)**
భూపాలపట్నం అటవీ ప్రాంతంలో బుధవారం బైక్ అదుపుతప్పి బోల్తా పడింది. కాషాబోయిన మొండి, జెల్ల మహేష్ అనే ఇద్దరు బైక్‌పై వెళ్తుండగా, దుప్పి అడ్డంగా రావడంతో ఈ ప్రమాదం జరిగింది. ఇద్దరికి గాయాలవడంతో వారిని సిర్పూర్ ప్రభుత్వ ఆసుపత్రికి, ఆపై కాగజ్‌నగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

# పిలిచే భక్తునికి.. పలికే దైవం



- అబ్దుల్లాపూర్‌లో కొలువుదీరిన మోక్ష గణపతి
- 41 సంవత్సరాలుగా వినాయకునికి పూజలు
- ఐక్యతకు నిదర్శనం అబ్దుల్లాపూర్ గ్రామం
- స్వామి దర్శనానికి పోటెత్తుతున్న భక్తులు
- 11 రోజుల పాటు భక్తులకు అన్నదానం..
- భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసిన గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు



**ముథోల్, సెప్టెంబర్ 3 (ప్రభాత సమాచారం)** నిర్మల్ జిల్లా ముథోల్ నియోజకవర్గంలోని లోకేశ్వరం మండలంలోని అదో చిన్న గ్రామం.. ఇటు తెలంగాణ మహారాష్ట్ర సరిహద్దులో ఉన్న ఈ గ్రామం పేరే అబ్దుల్లాపూర్.. ఈ గ్రామం పేరు ఇప్పుడు రాష్ట్రాల్లోని ప్రజల నోళ్లలో నానుతోంది. అబ్దుల్లాపూర్ గ్రామంలో ఏటా వినాయక చవితి వేడుకలు ఘనంగా జరుగుతాయి. ఇక్కడి కర్ర గణేశుడిని చూసేందుకు దక్షిణ, ఉత్తరాది రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు వస్తుంటారు. 11 రోజుల పాటు కర్ర గణపతికి పూజలు జరుగుతాయి. గ్రామంలో దాదాపు 2,500 మంది జనాభా ఉంటారు. 1982లో ఈ గ్రామం పునరావాసంగా ఏర్పడింది అప్పటి నుంచి వినాయక చవితి వచ్చిదంటే చాలు.. ఈ గ్రామస్తులందరిదీ ఒకే మాట.. ఒకే బాట. ఐక్యత ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందంటారు. ఒకే వినాయకుడిని గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసుకుని ఒకే చోట పూజలు చేస్తారు. ఏటా ఇదే విగ్రహాన్ని గ్రామస్తులు ప్రతిష్ఠాపన చేసి పూజలు చేస్తారు.

అయితే గత రెండేళ్ల కిందటి వరకు కొనుగోలు చేసేఇన గణపతి విగ్రహాలను మండపాలలో కొలువుదీర్చేవారు.. గతేడాది ప్రత్యేకంగా మోక్ష (కర్ర) గణపతని తయారు చేయించారు. దాదాపు రూ.4వలక్షలు వెచ్చించి ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాళహస్తి సమీపంలోని ఓ కుగ్రామంలో ప్రత్యేకంగా పూజలు చేసి కర్రతో గణపతిని తయారు చేయించి గ్రామానికి తీసుకు వచ్చారు. ప్రత్యేక పూజలు చేసి ప్రతిష్టించారు. ఈసారి భారీగా భక్తులు వస్తుండడంతో దర్శనానికి అన్ని ఏర్పాట్లు చేశారు. 'అబ్దుల్లాపూర్ గ్రామం ఐక్యతకు నిదర్శనం. ఈ గ్రామస్తులందరిదీ ఒకే మాట.. ఒకే బాట. ఐక్యత ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని నిరూపించింది.



మోక్ష (కర్ర) గణపతి
గ్రా॥ అబ్దుల్లాపూర్

మండలంలోని అబ్దుల్లాపూర్ గ్రామంలో శనివారం మోక్ష కర్ర గణపతి కొలువుదీరాడు. గ్రామంలోని మహిళలు ప్రజలు మంగళ హారతులతో వెళ్లి కర్ర వినాయకుని శోభయాత్రగా ప్రధాన వీధుల గుండా తీసుకొచ్చి బ్రాహ్మణోత్తములచే మండపంలో ప్రతిష్టించారు. ఈ గ్రామంలో గత 40 సంవత్సరాలుగా గ్రామస్తులంతా కలిసి ఒకే వినాయకుడిని ప్రతిష్టించి ఉదయం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ ఉండేవారు గత సంవత్సరం పర్యావరణాన్ని రక్షించేందుకు గ్రామస్తులంతా కలిసి కర్ర వినాయకుని ప్రతిష్టించాలని నిర్ణయించి ఆంధ్రప్రదేశ్లోని రేణిగుంట గ్రామంలో భక్తి నిష్టతో ఒకే కర్రతో ప్రత్యేకంగా మోక్ష గణపతిని తయారు చేయించారు. గత సంవత్సరం నుండి గ్రామాభివృద్ధి కమిటీ, గణపతి కమిటీల ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. దీంతో గ్రామంలోని ప్రజల ఐక్యతను మరింత చాటుతున్నారు ఈ ఉత్సవాల్లో ప్రతిరోజు ప్రత్యేక పూజలతో పాటు అన్న ప్రసాద వితరణ కూడా నిర్వహిస్తున్నారు. ఈ అబ్దుల్లాపూర్ గ్రామం ముధోల్ మండల కేంద్రం నుండి 13 కిలోమీటర్లు లోకేశ్వరం మండల కేంద్రం నుండి పది కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఈ ఉత్సవాల్లో ఆయా గ్రామాల నుండి వచ్చిన భజనలు కీర్తనలను భక్తులను ఎంతగానో అలరిస్తున్నాయి. ఈ మోక్ష కర్ర గణపతిని దర్శించుకుని అష్ట ఐశ్వర్యాలు పొందాలని గ్రామస్తులు కోరుకుంటున్నారు. మండలం మండలంలోని అబ్దుల్లాపూర్ గ్రామంలో మోక్ష కర్ర గణపతి యొక్క దర్శనానికి వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా ప్రతి ఏటా వివిధ గ్రామాల నుండి పెద్ద ఎత్తున భక్తులకు స్వాగతం సుస్వాగతం వివిధ గ్రామాల నుంచి మహారాష్ట్ర నుండి వచ్చే భక్తులకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చే భక్తులకు స్వాగతం సుస్వాగతం ప్రతిరోజు ఉదయం సాయంత్రం వినాయకుని దర్శనానికి అన్ని ఏర్పాట్లు చేయడం జరిగింది. గ్రామ మోక్ష కర్ర గణపతి కమిటీ సభ్యులు, వీడీసీ, గణేష్ మండలి తరపున గణేష్ దర్శనానికి వచ్చే భక్తులకు స్వాగతం పలుకుతున్నారు.

## ఐక్యమత్యమే మా బలం..



లోకేశ్వరం మండలంలోని అబ్దుల్లాపూర్ గ్రామం అంటేనే ఐక్యతకు నిదర్శనమని లోకేశ్వరం మండల యూత్ కాంగ్రెస్ అభ్యర్థి అర్ష ప్రసాద్ అన్నారు. ప్రతీ సంవత్సరంలాగే ఈ యేడు కూడా గ్రామంలో ప్రత్యేకంగా మోక్ష (కర్ర) గణపతని ప్రతిష్టించినట్లు ఆయన తెలిపారు. స్వామి వారి దర్శనం కోసం తెలంగాణ నుంచే కాకుండా మహారాష్ట్ర, కర్నాటక నుంచి కూడా భక్తులు వస్తున్నారన్నారు. ఇక్కడికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు లోకేశ్వరం మండల యూత్ కాంగ్రెస్ అభ్యర్థి అర్ష ప్రసాద్ తెలిపారు.

---

# మహారాష్ట్ర సరిహద్దులో రోడ్డు ప్రమాదం

- ముగ్గురి మృతి, ఇద్దరికి తీవ్ర గాయాలు
- ఆగి ఉన్న లారీ ఢీకొన్న లారీ
- దైవ దర్శనానికి వెళ్లి వస్తుంగా ఘటన
- మృతులు నిజామాబాద్ జిల్లా వర్ని మండలానికి చెందిన వారిగా గుర్తింపు

**ముథోల్, సెప్టెంబర్ 3 (ప్రభాత సమాచారం)** మహారాష్ట్ర సరిహద్దులోని బోకర్ తాలూకా నందా గ్రామ సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు నిజామాబాద్ జిల్లా వర్ని మండలం హున్సపూర్ గ్రామానికి చెందిన దంపతులు చేకూరి బుల్లిరాజు (50), సునీత (45), బంధువైన బోధన్ మండలం బెల్లాల్ గ్రామానికి చెందిన వాణి (40), మరో ఇద్దరితో కలిసి బుధవారం ఉదయం కారులో మహారాష్ట్రలోని బాలాజ్ కర్ర వినాయకుని దర్శించుకునేందుకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో తెలంగాణ సరిహద్దులోని మూడు కిలోమీటర్ల దూరంలో గల గ్రామ సమీపంలో ఆగి ఉన్న లారీని ఢీకొట్టారు. దీంతో కారులో ఉన్న రాజు, సునీత, వాణి అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం మహారాష్ట్రలోని బోకర్ ఆస్పత్రికి తరలించారు.



---

# వేపాకులతో అద్భుత ఆరోగ్యం

## జీవితంలో అసలు డాక్టర్ అవసరమే ఉండదు

మన ఆయుర్వేదం చాలా గొప్పది. అందులో అన్ని రోగాలకు మందు ఉంటుంది. మన చుట్టూ ఎన్నో చెట్లు ఉంటాయి. కానీ వాటి గురించి, అవి కలిగించే ప్రయోజనాల గురించి మనం పట్టించుకోం. అలాగే వేప చెట్టు కూడా ఒకటి. వేపాకు అనేక ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉన్న ఒక శక్తివంతమైన ఆయుర్వేద మూలిక. దీని రుచి చేదుగా ఉన్నప్పటికీ, ఇందులో ఉండే ఔషధ గుణాలు శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచడానికి, అనేక వ్యాధులను నివారించడానికి సహాయపడుతుంది.

**రక్తాన్ని శుద్ధి చేస్తుంది**

వేపాకు రక్తాన్ని శుద్ధి చేయడంలో అద్భుతంగా పనిచేస్తుంది. ఇందులో ఉండే సమ్మేళనాలు శరీరం నుండి విష పదార్థాలను తొలగించడంలో సహాయపడతాయి. రక్తం శుభ్రంగా ఉన్నప్పుడు చర్మ సమస్యలు తగ్గడంతోపాటు మొత్తం ఆరోగ్యం మెరుగుపడుతుంది. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో వేపాకులు సహాయపడతాయి. ఇది ఇన్సులిన్ సున్నితత్వాన్ని పెంచి తద్వారా శరీరం గ్లూకోజ్‌ను సమర్థవంతంగా ఉపయోగించుకుంటుంది. మధుమేహ రోగులకు ఇది చాలా ప్రయోజనకరంగా ఉంటుంది.

**రోగనిరోధక శక్తిని పెంచుతుంది**

వేపాకులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ వైరల్, యాంటీ బాక్టీరియల్ లక్షణాలు శరీర రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తాయి. ఇది జలుబు, ఫ్లూ, యు ఇతర అంటువ్యాధుల నుండి శరీరాన్ని రక్షిస్తుంది. జీర్ణక్రియ మెరుగుపడుతుంది. పేగులో ఉండే చెడు బ్యాక్టీరియాను తొలగిస్తుంది. చర్మ సమస్యలకు వేపాకు ఒక అద్భుతమైన ఔషధం. దీనిలోని యాంటీ బాక్టీరియల్, యాంటీ ఫంగల్ గుణాలు మొటిమలు, దద్దుర్లు, చర్మపు ఇన్ఫెక్షన్లు, దురద వంటి సమస్యలను తగ్గిస్తాయి.

**నీటిలో మరిగించి వడకట్టి తాగాలి**

పురాతన కాలం నుండి వేప పుల్లలను దంతాలను శుభ్రం చేయడానికి ఉపయోగిస్తున్నారు. వేపాకులోని యాంటీబాక్టీరియల్ లక్షణాలు నోటిలోని బ్యాక్టీరియాను నాశనం చేసి, దంతక్షయం, చిగుళ్ల వ్యాధులు, నోటి దుర్వాసనను నివారిస్తాయి. కొన్ని తాజా వేపాకులను నీటితో కలిపి మెత్తగా పేస్ట్ చేసి, చర్మ సమస్యలకు అప్లై చేయవచ్చు. కొన్ని వేపాకులను నీటిలో మరిగించి, ఆ నీటిని వడకట్టి తాగవచ్చు. ఇది రక్తాన్ని శుద్ధి చేయడానికి సహాయపడుతుంది. వేపాకు నూనెను చర్మ సమస్యలకు, జుట్టు రాలడానికి లేదా మసాజ్ కోసం ఉపయోగించవచ్చు.








# పొద్దు పొడువగానే.. గడప గడపకు వెళ్లి..! జనం గుండె చప్పుడు విన్న ఎమ్మెల్యే



- ప్రజలతో మమేకమై ఆప్యాయంగా పలకరిస్తూ వీదుల్లో మార్నింగ్ వాక్
- సదర్మాట్ ను సందర్శించి రైతుల సమస్యలు తెలుసుకొన్న ఎమ్మెల్యే వెడ్మ భోజ్జు పటేల్

**ఖానాపూర్, సెప్టెంబర్ 3 (ప్రభాత సమాచారం)**

ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ భోజ్జు పటేల్ స్టైలే వేరు.. ఆయన ఎప్పుడు ప్రజల మధ్యనే గడిపి వారి సమస్యలు పరిష్కరించాలనే తత్వం.. సమస్యను స్వయంగా చూసి పరిష్కరించే అలవాటు.. అందుకే అయన 'పొద్దు పొడుపు-బొజ్జన్న అడుగు' పేరుతో కార్యక్రమం నిర్వహిస్తున్నారు. కార్యక్రమం లో భాగంగా గ్రామాల్లో మార్నింగ్ వాక్ చేస్తు ప్రజలతో మమేకమై వారి గుండె చప్పుడు వింటున్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం లో మంగళవారం రాత్రి బస చేసిన ఎమ్మెల్యే వెడ్మ భోజ్జు పటేల్ బుధవారం తెల్లవారు జామున సుర్జాపూర్ కొత్తవాడ మేడంపెల్లి గ్రామాల్లో మార్నింగ్ వాక్ చేసారు. ప్రజలతో ఆప్యాయంగా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ప్రజల బాధలు విన్నారు. సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. నేనున్నానని భరోసా ఇచ్చారు. టీ కొట్టులో సామాన్య యువకుడిలా కూర్చొని అక్కడ జనం తో మాటముచ్చట చేసారు. అక్కడి నుంచి సదర్మాట్ ప్రాజెక్ట్ కు వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. సదర్మాట్ కాలువ నీటితో ముఖం కడుక్కున్నారు. రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం రైతుల కోసం అమలు చేస్తున్న కార్యక్రమాలను వివరించారు.



# తారు రోడ్ల నిర్మాణానికి రూ.28 కోట్లు మంజూరు..!

- తారు రోడ్ల నిర్మాణానికి రూ.28 కోట్లు మంజూరు
- 12 రోడ్ల నిర్మాణంతో 25 కిలోమీటర్ల రహదారి సౌకర్యం
- ఫలించిన ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ భోజ్జు పటేల్ కృషి

(ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి)

ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ భోజ్జు పటేల్ కృషి ఫలించించింది.ప్రభుత్వం 25.85 కిలోమీటర్ల తారు రోడ్లు నిర్మించేందుకు రూ.28కోట్ల 71లక్షలు కేటాయించింది.



గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ విభాగం రోడ్ల నిర్మాణ పనులు చేపట్టనుంది. దీంతో మారుమూల గ్రామాలకు రహదారి సౌకర్యాలు మెరుగుపడనున్నాయి. ఇంద్రవెల్లి మండలంలోని ఘట్టెపల్లి నుంచి కొలాంగూడకు నాలుగున్నర కిలోమీటర్ల తారు రోడ్డు నిర్మాణానికి రూ.రూ.330.99 లక్షలు, సిరికొండ మండలంలో సిరికొండ ఆర్ అండ్ బి రోడ్ నుంచి ద్రసు పటేల్ గూడ లకంపూర్ వరకు 2.70 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ.262.05 లక్షలను ప్రభుత్వం మంజూరు చేసింది.ఉట్నూర్ మండలంలో గొట్టి రోడ్డు నుంచి కోలాంగూడ వరకు కిలోమీటర్ తారు రోడ్డు నిర్మాణానికి రూ.103.58 లక్షలు,రాంగూడ రోడ్డుకు కు 1.80 కిలోమీటర్ల నిర్మాణానికి రూ.141.54 లక్షల నిధులు మంజూరయ్యాయి.సిరికొండ మండలం కన్నపూర్ నుంచి కన్నపూర్ తాండ వరకు 1.40 కిలోమీటర్ల తారు రోడ్డు నిర్మాణానికి రూ.300.92 లక్షల నిధులు మంజూరయ్యాయి.

ఉట్నూర్ పట్టణంలో పాత బస్ స్టాండ్ నుంచి పర్ధాన్ గూడ వరకు 0.60 కిలోమీటర్లమిగిలి ఉన్న రోడ్డును పూర్తి చేసేందుకు రూ.114.58 లక్షలు మంజూరయ్యాయి. జన్నారం మండలంలో లింగాలపల్లె గ్రామానికి 1.70కిలోమీటర్ల తారు రోడ్డు నిర్మించేందుకు రూ.173లక్షలు,గోండుగూడ గ్రామానికి 2.50 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ. 360 లక్షలు,నర్సింగాపూర్ గ్రామానికి 2.90 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ. 340 లక్షలు,సోనాపూర్ తాండగ్రామానికి 2.40 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ. 320 లక్షలు మంజూరయ్యాయి. దాస్తురాబాద్ మండలం ఎర్రగుట్ట గ్రామానికి 2.50 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ.250 లక్షలు,కడం మండలం వకీల్ నగర్ గ్రామానికి 1.85 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ. 1.85 లక్షలు మంజూరు అయ్యాయి.

విలేకరులు కావలెను
ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ఆదరణ పొందుతున్న ప్రభాత సమాచారం తెలుగు దినపత్రికకు ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పని చేయుటకు జిల్లాల వారిగా సాఫ్ట్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారిగా ఆర్సీ ఇన్‌చార్జీలు, మండలాల వారిగా విలేకరులు కావలెను.
ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి
9440977660, 9110718194
PRABHATHASAMACHARAM.COM
TELANGANA TELUGU DAILY

## గణనాథునికి 108 రకాల నైవేద్యాలు



**మందమర్రి, సెప్టెంబర్ 3 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలోని ప్రాణహిత కాలనీలో సిద్ధి వినాయక గణేశ్ మండలి ఆధ్వర్యంలో గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా 108 రకాల ప్రసాదాలతో సింగరేణి కార్మిక, కార్మికేతర కుటుంబ సభ్యులు స్వామివారికి నైవేద్యాన్ని సమర్పించారు. అనంతరం ప్రత్యేక భజనలతో గణపతికి పూజలు చేశారు.

## ఉపాధ్యాయుడి సస్పెన్షన్

**జైనూర్, సెప్టెంబర్ 3 (ప్రభాత సమాచారం)**

విధులలో నిబంధనలు ఉల్లంఘించిన ఎస్‌జిటి విలాస్‌ను విధులనుండి సస్పెండ్ చేయడం జరిగిందని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులు రమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని జైనూర్ మండలం సుకుద్‌పల్లి ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఎస్.జి.టి.గా పని చేస్తున్న విలాస్ విధులకు మద్యం సేవించి హాజరయ్యారని గ్రామస్తులు చేసిన ఫిర్యాదు మేరకు చేసిన విచారణలో ఎస్‌సిఆర్‌పి, జైనూర్ సూచన ప్రకారం ఐటీడీఏ పీవో ఆదేశాల మేరకు ప్రభుత్వ నియమ, నిబంధనల ప్రకారం సదరు ఎస్.జి.టి.ను విధుల నుండి సస్పెండ్ చేయడం జరిగిందన్నారు.

